విశాలాంధ్ర

కృష్ణా, ఎన్టీఆర్
గుంటూరు, పల్నాడు

శుక్రవారం 06 జూన్ 2025 8 పేజీలు

మానవతా మూర్తి మునగోటి పద్మావతి

సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి ముప్పాళ్ల నాగేశ్వరరావు

విశాలాంధ్ర-పెదకూరపాడు : నిజాయితీ, నిబద్ధత, విలువలతో కూడిన మానవతా మూర్తి మునగోటి పద్మావతి మృతి కమ్యూనిస్టు పార్టీకి తీరని లోటని సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి ముప్పాళ్ల నాగేశ్వరరావు అన్నారు. పల్నాడు జిల్లా పెదకూరపాడు మండల పరిధిలోని 75 తాళ్లూరు గ్రామంలో సీపీఐ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన మునగోటి పద్మావతి సంస్కరణ సభకు ముప్పాళ్ల ముఖ్యఅతిథిగా పాల్గొని ప్రసంగించారు సభకు ఆంధ్రప్రదేశ్ ప్రజానాట్యమండలి పల్నాడు జిల్లా ప్రధాన కార్యదర్శి భైరాపట్నం రామకృష్ణ అధ్యక్షత వహించారు. ముప్పాళ్ల మాట్లాడుతూ సాటి మనిషి కష్టాన్ని అంచనా వేసి మంచి ఆదర్శవంతమైన ఆలోచన చేస్తూ -మిగతా 2 లో ...

నేడు జిల్లా వ్యాప్తంగా చంద్ర రాజేశ్వరరావు జయంతి ఉత్సవాలు

సీపీఐ గుంటూరు జిల్లా కార్యదర్శి జంగాల అజయ్‌కుమార్ పిలుపు

విశాలాంధ్ర-గుంటూరు కలెక్టరేట్ : స్వాతంత్ర సమర యోధుడు, భూ హక్కుల పోరాట యోధుడు, తెలంగాణ సాయుధ రైతాంగ ఉద్యమంలో కీలక పాత్ర పోషించిన సీపీఐ పూర్వ ప్రధాన కార్యదర్శి అమరజీవి చంద్ర రాజేశ్వరరావు 111వ జయంతిని ఈ నెల 6న జిల్లా వ్యాప్తంగా ఘనంగా నిర్వహిస్తున్నట్లు సీపీఐ జిల్లా కార్యదర్శి జంగాల అజయ్‌కుమార్ తెలిపారు. గుంటూరు మల్లయ్య లింగంభవన్‌లో గురువారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఈ సందర్భంగా పార్టీలో ఆయన్ను స్మరించు కుంటూ సభలు, ఘన నివాళులు, ప్రజా సమావేశాలు నిర్వహిస్తున్నట్టు తెలిపారు.

బుడమేరుపై ఎనికేపాడు వద్ద ఉన్న

అండర్ టన్నెల్ వెడల్పు చేయాలి

దోనేపూడి శంకర్

విశాలాంధ్ర-విజయవాడ (వన్‌టౌన్): బుడమేరుపై ఎనికేపాడు వద్ద ఉన్న అండర్ టన్నెల్ 62మీటర్ల వెడల్పు చేసి తూములు పెంచి సులభంగా వరద నీరు కిందకు పారే విధంగా చర్యలు చేపట్టాలని సీపీఐ ఎన్టీఆర్ జిల్లా కార్యదర్శి దోనేపూడి శంకర్ రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గురువారం సీపీఐ ఎన్టీఆర్ జిల్లా సమితి ఆధ్వర్యంలో జిల్లా కార్యదర్శి దోనేపూడి శంకర్, ఆంధ్రప్రదేశ్ కౌలు రైతులు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పి.జమలయ్య, ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు మల్నీడీ యల్లమందారావు, ఏఐవైఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పర్చూరు రాజేంద్రబాబు, జిల్లా ఏఐవైఎఫ్ ప్రధాన కార్యదర్శి లంకా గోవింద రాజులు, సీపీఐ నగర పార్టీ నాయకులు -మిగతా 2 లో ...

అట్టహాసంగా 'మసూలా బీచ్ ఫెస్-2025'

విశాలాంధ్ర బ్యూరో మచిలీపట్నం : మచిలీపట్నం మంగినపూడి తీరంలో 'మసులా బీచ్ ఫెస్ట్-2025' గురువారం అట్టహాసంగా ప్రారంభమైంది. రాష్ట్ర పర్యాటక శాఖమంత్రి కందుల దుర్గేశ్ ముఖ్యఅతిథిగా హాజరై కార్యక్రమాన్ని ప్రారంభించారు. బీచ్ ఫెస్ట్.. పర్యాటకులు, జిల్లా వాసులకు వినోదం, ఆహ్లాదం అన్ని రాష్ట్రాల రుచులను అందించనుంది. విద్యా సాంస్కృతిక కేంద్రంగా.. స్వాతంత్ర్య, రాజకీయ చైతన్యానికి కేంద్ర బిందువుగా నిలిచిన మచిలీపట్నం చరిత్రను గుర్తు చేసేలా మంగినపూడిలో నాలుగు రోజులపాటు ఈ ఉత్సవాలు జరగనున్నాయి. ఈ నెల 5 నుంచి 8 వరకు సాంస్కృతిక, వినోద కార్యక్రమాలు, జాతీయ స్థాయిలో సి-కమా కింగ్, కనోయింగ్ బీచ్ కబడ్డీ, వాలీబాల్ పోటీలు నిర్వహిస్తున్నారు. 80 అడుగుల అవరావతి ఐకాన్ టవర్, 100 అడుగుల ఎత్తులో జాతీయ పతాకం శాశ్వత నిర్మాణాలుగా ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో మంత్రి కొల్లు రవీంద్ర, ఆర్టీసీ ఛైర్మన్ కొనకళ్ల నారాయణ పలువురు ప్రజాప్రతి నిధులు, కలెక్టర్ డి.కే.బాలాజీ, జేసీ గీతాంజలీ శర్మ పాల్గొన్నారు.

మెగా డీఎస్సీకి పకడ్బందీ ఏర్పాట్లు

వివిధ మార్గాల్లో ప్రత్యేక బస్సు సర్వీసులు

పటిష్ట బందోబస్తు ప్రణాళిక అమలుకు చర్యలు

సమన్వయ శాఖల అధికారులు సమష్టి కృషితో పనిచేయండి

ప్రతి దశలోనూ అప్రమత్తం : కలెక్టర్ డాక్టర్ జి.లక్ష్మీశ



విశాలాంధ్ర-విజయవాడ (వన్‌టౌన్): రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా మెగా డీఎస్సీ - కంప్యూటర్ బేస్ట్ టెస్ట్ (సీబీటీ)ను ఈ నెల 6 నుంచి 30వ తేదీ వరకు నిర్వహించనుందని.. జిల్లాలో డీఎస్సీ పరీక్షలను విజయవంతంగా నిర్వహించేందుకు పకడ్బందీ ఏర్పాట్లు చేశామని, సమన్వయంతో పనిచేయాలని, అప్రమత్తంగా ఉండాలని జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ ఆదేశించారు. మెగా డీఎస్సీ పరీక్షల నిర్వహణపై కలెక్టర్ లక్ష్మీశ గురువారం పాఠశాల విద్య, రెవెన్యూ, పోలీస్, విద్యుత్, వైద్య ఆరోగ్యం తదితర శాఖల అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించి, ఏర్పాట్లపై సమీక్షించారు.

హరితాంధ్ర లక్ష్య సాధనలో భాగస్వాములుకండి

- రాష్ట్రంలో 29 శాతం ఉన్న పచ్చదనాన్ని 50 శాతం, జిల్లాలో 11 శాతం హరిత విస్తీర్ణాన్ని 33 శాతానికి పెంచుదాం
- రాష్ట్రవ్యాప్తంగా కోటి మొక్కలు, జిల్లాలో 2 లక్షల 60 వేల మొక్కలను నాటి స్వర్ణాంధ్రను సాకారం చేద్దాం
- రాష్ట్రవైద్య, ఆరోగ్య మంత్రి, ఎన్‌టీఆర్ జిల్లా ఇన్‌ఛార్జ్ మంత్రి సత్యకుమార్ యాదవ్

విశాలాంధ్ర-విజయవాడ (వన్‌టౌన్): మొక్కలు నాటడం ద్వారా పర్యావరణ సమతుల్యతను కాపాడుతూ, ప్రజల జీవన ప్రమాణాలు పెంచే విధంగా కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు కృషిచేస్తున్నాయని వైద్య ఆరోగ్యం, కుటుంబ సంక్షేమం, జిల్లా ఇన్చార్జి మంత్రివర్యులు సత్య కుమార్ యాదవ్ అన్నారు. ప్రపంచ పర్యావరణ దినోత్సవం, వనమహోత్సవం -2025 కార్యక్రమాన్ని పురస్కరించుకొని గురువారం జిల్లా అటవీ శాఖ ఆధ్వర్యంలో విజయవాడ రూరల్ కొత్తూరు తాడేపల్లి వద్ద నగరవనం వద్ద రాష్ట్ర వైద్య ఆరోగ్య కుటుంబ సంక్షేమం, జిల్లా ఇన్చార్జి మంత్రి సత్యకుమార్ యాదవ్, స్థానిక శాసనసభ్యులు వసంత కృష్ణ ప్రసాద్, జిల్లా కలెక్టర్ డాక్టర్ జి లక్ష్మీశ మొక్కలను నాటారు. అనంతరం మంత్రి మాట్లాడుతూ మొక్కలు నాటుదాం.... పర్యావరణాన్ని కాపాడుదాం... అనే వినాదంతో రాష్ట్రవ్యాప్తంగా కోటి మొక్కలను నాటే కార్యక్రమానికి శ్రీకారం చుట్టారన్నారు. మొక్కలను నాటి సంరక్షించడం ద్వారా పర్యావరణ సమతౌల్యత పాటు జీవన ప్రమాణాలు పెరుగుతాయన్నారు. గత ప్రభుత్వ హయాంలో మొక్కలు నాటడం మాని చెట్లను నరికివేసేవారన్నారు. గౌరవ ప్రధానమంత్రి నరేంద్ర మోడీ, గౌరవ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు పర్యావరణ పరిరక్షణకు ప్రాధాన్యతనిస్తూ మొక్కలు నాటడాన్ని -మిగతా 2 లో ...

(మొదటి పేజీ తరువాయి)

మానవతా మూర్తి మునగోటి పద్మావతి

వామపక్ష భావజాలాన్ని నలుదిశల చాటేందుకు తనవంతు కృషి చేసిన పద్మావతి భౌతికంగా మన మధ్య లేకపోయినా వారి ఆశయాలను ముందుకు తీసుకెళ్లినప్పుడే ఆమెకు నిజమైన నివాళులర్పించిన వారమౌతామని అన్నారు సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు జంగాల అజయ్‌కుమార్ మాట్లాడుతూ కమ్యూనిస్టు పార్టీ భావజాలం అంటే సొంత ఇంటిలా భావించే పద్మావతి కడవరకు కమ్యూనిస్టుగా కడతేరిన యోధురాలని ఘనంగా నివాళులర్పించారు. అనారోగ్యం సైతం లెక్కచేయక కమ్యూనిస్టు పార్టీ ఆశయాలకు అనుగుణంగా పనిచేయాలని ఏకైక లక్ష్యంతో నిరంతరం తపించిపోయేదని అన్నారు. సీపీఐ పల్నాడు జిల్లా కార్యదర్శి ఏ.మారుతి వరప్రసాద్ మాట్లాడుతూ కమ్యూనిస్టు పార్టీ ఆశయాలకు అనుగుణంగా పనిచేయటంలో తన వంతు పాత్ర నిర్వహించిందని ఆ కోణంలోనే కుటుంబం యావత్తు మంచి ఆలోచన నడవడికతో ముందుకు సాగుతూ ప్రజలకు చేరువయ్యారని కొనియాడారు. సీపీఎం పల్నాడు జిల్లా కార్యదర్శి గుంటూరు విజయకుమార్ మాట్లాడుతూ ఆదర్శవంతమైన ఆలోచనతో ఎర్రజెండా స్ఫూర్తితో కమ్యూనిస్టు భావజాలాన్ని నలు దిశల వ్యాప్తిచేయటంలో ప్రధాన భూమిక నిర్వహించిందన్నారు. ఆంధ్రప్రదేశ్ నాయిబ్రాహ్మణ రాష్ట్ర ఫెడరేషన్ నాయకులు, తెలుగుదేశం పార్టీ నాయకులు మద్దిరాల గంగాధర్ మాట్లాడుతూ కూలీల కష్టసుఖాలను తెలుసుకుంటూ నిరంతరం శ్రమించే మంచి కమ్యూనిస్టు నాయకురాలు పద్మావతి అని కొనియాడారు. సభలో సీపీఐ పల్నాడు జిల్లా సహాయ కార్యదర్శులు ఎస్కే హుస్సేన్, కాసా రాంబాబు, అరసం రాష్ట్ర కార్యదర్శి కొమ్మాలపాటి శరత్, టీడీపీ నాయకులు ఎస్కే నూర్జహాన్, ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి మేడా హనుమంతరావు, భవన నిర్మాణ కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షులు పుప్పాల బుజ్జి, ముప్పాళ్ల శివ, పి.సాంబశివరావు తదితరులు పాల్గొన్నారు. మునగోటి పద్మావతి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

బుడమేరుపై ఎనికేపాడు వద్ద ఉన్న అండర్ టన్నెల్ వెడల్పు చేయాలి

కోడాలి ఆనందరావు,స్థానిక పార్టీ నాయకులు తాటిశెట్టి సత్యనారాయణ, నరసింహారావు తదితరలతో ఎనికెపాడు వద్దన్న అండర్ టన్నెల్ ను పరిశీలించారు. ఈ సందర్భంగా దోనేపూడి శంకర్ మాట్లాడుతూ 2013లోని ఈ అండర్ టెన్నెల్ వద్ద 62 మీటర్లు వెడల్పు చేయటానికి భూమిని సేకరించాలని ఇరిగేషన్ ఇంజనీర్లు ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లినప్పటికీ రాష్ట్ర ప్రభుత్వం ఎటువంటి పనులు చెయ్యకుండా నిర్లక్ష్యం చేయటం వలన ప్రతి ఏడాది విజయవాడ ముంపు కారణం అవుతుందన్నారు. ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం స్పందించి యుద్ధ ప్రాతిపదికన ఎనికెపాడు అండర్ టన్నెల్ ను వెడల్పు చేసి తూములు సంఖ్యను పెంచి పైనుంచి వచ్చే వరద నీరు సునాయసంగా కొల్లేరులోకి వెళ్ళేటట్లు చర్యలు చేపట్టాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆంధ్రప్రదేశ్ కౌలురైతుల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పి.జమలయ్య, ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు మల్నీడి యల్లమందారావులు మాట్లాడుతూ ఎనికెపాడు నుండి కొల్లేరు వరకు అక్కడ నుండి ఉప్పుటేరు ద్వారా సముద్రంలో వరద నీరు సులభంగా నీరు వెళ్లడానికి ఉన్న ఆక్రమణలు తొలగించాలని,కొంతమంది పెత్తందారులు బుడమేరు ప్రాంతాన్ని ఆక్రమించి రొయ్యలుచెరువులు, చేపలచెరువులు, వెదురు పెంపకం, ఆయిల్ పామ్ తోటలు వేసి బుడమేరును ఆక్రమించారని వీటిని తొలగించకుండా బుడమేరు వరద ముంపును నివారించలేమన్నారు. అక్రమణదారుల పట్ల రాష్ట్ర ప్రభుత్వం మెతక వైఖరి వహించడం సరైంది కాదని వారన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఆక్రమణలు తొలగించడానికి చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు.

హరితాంధ్ర లక్ష్య సాధనలో భాగస్వాములుకండి

ప్రోత్సహిస్తున్నారన్నారు. కోవిడ్ సమయంలో ఆక్సిజన్ విలువను ప్రతి ఒక్కరు గుర్తించారని అన్నారు. ఒక చెట్టు తన జీవిత కాలంలో 50 నుండి వంద సంవత్సరాల కాలంలో రూ. 10 లక్షలు విలువైన ఆక్సిజన్ ప్రకృతికి అందిస్తుందన్నారు. వాతావరణంలో కార్బన్ డై ఆక్సైడ్ శాతాన్ని ఉష్ణోగ్రతను తగ్గిస్తాయన్నారు. పర్యావరణ సమతుల్యత లోపించడం వల్ల ప్రపంచవ్యాప్తంగా ప్రకృతి వైపరీత్యాలు సంభవించి వరదలు తుఫానులతో అపార నష్టాన్ని కలిగిస్తున్నాయన్నారు. పర్యావరణాన్ని పరిరక్షించుకోవాల్సిన బాధ్యత అందరి పైనా ఉందన్నారు. రాష్ట్రవ్యాప్తంగా ప్రస్తుతం ఉన్న 29 శాతం గ్రీనరీని స్వర్ణాంధ్ర విజన్ 2047 నాటికి 50 శాతం పెంచేలా పక్కా ప్రణాళికతో ముందుకు వెళుతున్నామన్నారు. మొక్కలు నాటుదాం వాటిని సంరక్షిద్దాం అనే వినాదంతో హరిత విస్తీర్ణాన్ని పెంచి ఆరోగ్యకర సమాజ నిర్మాణంలో అందరూ భాగస్వాములు అవుదామని మంత్రి సత్య కుమార్ యాదవ్ పిలుపునిచ్చారు. వసంత గ్రీన్ ప్రాజెక్టును అమలుచేస్తున్నా: ఎమ్మెల్యే వసంత కృష్ణ ప్రసాద్ స్థానిక ఎమ్మెల్యే వసంత కృష్ణ ప్రసాద్ మాట్లాడుతూ నేడు పర్యావరణ సమతౌల్యత దెబ్బ తినడం ద్వారా ప్రకృతి వైపరీత్యాలు సంభవిస్తున్నాయన్నారు. బుడమేరుకు ఆకస్మిక వరదలు సంభవించి నష్టాన్ని కలిగించా యని ఉదహరించారు. పకృతిని దూరం చేయకుండా దగ్గరకు తీసుకుందాం అన్నారు.

పర్యావరణ పరిరక్షణ భవిష్యత్తుకు భద్రత

విశాలాంధ్ర-విజయవాడ (వన్‌టౌన్): పర్యావరణ పరిరక్షణ మన అందరి బాధ్యతతో పాటు మన భవిష్యత్తుకు భద్రత అని మహిళా సమాఖ్య రాష్ట్ర కార్యదర్శి పి.దుర్గాభవానీ, పంచదర్ల దుర్గాంబ అన్నారు. ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా భారత జాతీయ మహిళా సమాఖ్య పిలుపు మేరకు మహిళా సమాఖ్య నగర సమితి ఆధ్వర్యంలో గురువారం విజయవాడ కొత్తపేటలోని కేబీఎన్ కళాశాలలో మొక్కలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రోజురోజుకు పెరిగిపోతున్న విపరీత కాలుష్యం పొంచి ఉందని దీని నుండి సంరక్షణ పొందుటకు పర్యావరణ పరిరక్షణకు ప్రాధాన్యత ఇవ్వాలని అన్నారు. పర్యావరణ దినోత్సవం పురస్కరించుకుని, ప్రజలందరూ ప్రతి ఒక్కరు తమ ఇంటి ఆవరణలో మొక్కను నాటాలన్నారు. ఆరోగ్యకరమైన జీవితానికి, పచ్చటి పర్యావరణం ఎంతో దోహదపడుతోందన్నారు. ప్రతి ఒక్కరూ మొక్కలు నాటడం వల్ల, భావితరాల వారి భవిష్యత్తుకు బాటలు వేసిన వారు అవుతారని చెప్పారు. అవసరానికి కన్నా ప్లాస్టిక్ ఎక్కువగా వాడుతుండటంతో సముద్రాలకు, భూమిపై ఉండే మనుషులకు, మూగజీవాలకు ముప్పుగా మారుతుందన్నారు. ప్లాస్టిక్ వాడటంపై ఎవరికి వారు పునఃపరిశీలించుకోవాలన్నారు. అందరూ మొక్కలను నాటాలని, చెట్లను పరిరక్షించి భవిష్యత్ తరాలకు ఆరోగ్యకరమైన వాతావరణాన్ని అందించాలని తెలిపారు. నీటిని వృద్ధా చేయకుండా వర్షపు నీటిని నిలువచేసుకోవాలని తెలిపారు. పర్యావరణ పరిరక్షణ కోసం ప్రతి ఒక్కరూ చైతన్యదాయకమైన అడుగు వేయాలన్నారు. అనంతరం కళాశాల విద్యార్థిని విద్యార్థులకు 250 మొక్కలను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో నగర అధ్యక్షులు ఓర్సు భారతి, నగర నాయకులు డి.రమణమ్మ, చింతాడ పార్వతి, నీలాపు భాగ్యలక్ష్మీ, ఆర్.ఉమా, కళ్యాణి, కేబీఎన్ కళాశాల ఏవో నారాయణరావు, ప్రిన్సిపాల్ కృష్ణవేణి, ఎన్ఎస్ఎస్ సాంబశివరావు తదితరులు పాల్గొన్నారు.

రైతులకు మంచి చేద్దాం : ఎమ్మెల్యే వెనిగండ్ల

విశాలాంధ్ర - గుడివాడ : గుడివాడ నియోజకవర్గ పరిధిలోని రైతాంగానికి మంచి చేసేందుకు అధికారులు, నీటి సంఘాలు అందరం కలిసి పని చేద్దామని ఎమ్మెల్యే వెనిగండ్ల రాము అన్నారు. గురువారం స్థానిక ఏలూరు రోడ్డులోని ప్రజా వేదిక కార్యాలయంలో ఇరిగేషన్ & డ్రైనేజీ అధికారులతో ఎమ్మెల్యే రాము సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో పాల్గొన్న అధికారులు నియోజకవర్గ వ్యాప్తంగా కాలువల్లో జరుగుతున్న అభివృద్ధి పనుల పురోగతిపై సమీక్షించిన ఎమ్మెల్యే రాము అధికారుల వివరణతో సంతృప్తి వ్యక్తం చేశారు. ఒకటి రెండు చోట్ల కాంట్రాక్టర్ల నిర్లక్ష్యాన్ని గుర్తించి మందకోడిగా పనులు చేస్తే ఊరుకోనని కాంట్రాక్టర్ల నిర్లక్ష్యంతో పనులు ఆలస్యం అయితే వారిని బ్లాక్ లిస్ట్‌లో పెట్టేందుకు కూడా వెనకాడనని అధికారులతో అన్నారు. ఈ సందర్భంగా డిసి చైర్మన్లు తీసుకొచ్చిన కొన్ని సమస్యలను అధికారుల తెలిపారు. నిర్ణీత సమయంలో సమస్యలను పరిష్కరించాలని సూచించారు. సమస్యల పరిష్కారానికి అధికారులు, నీటి సంఘాలు కలిసి పనిచేయడం వల్ల చక్కటి పురోగతి సాధిస్తున్నామన్నారు. వర్షాలు కురిసేలోపు ఇరిగేషన్ డ్రైనేజీ కాలువలలో సమస్యలను పరిష్కరించేలా అన్ని చర్యలు తీసుకోవాలన్నారు. ఈ సమావేశంలో ఇరిగేషన్ డి.ఈ భరత్, డ్రైనేజీ డి.ఈ గణపతి, డి.సి చైర్మన్లు యార్లగడ్డ రవి, బొమ్మనబోయిన ఏసుబాబు, ఆంజనేయులు, ఏఈలు, నీటి సంఘాల నాయకులు పాల్గొన్నారు.

ఘనంగా ప్రపంచ పర్యావరణ దినోత్సవం

విశాలాంధ్ర - కూచిపూడి : మొవ్వ మండలంలోని 21 గ్రామపంచాయతీల్లో గురువారం ప్రపంచ పర్యావరణ దినోత్సవం నిర్వహించారు. జిల్లా నీటి యాజ మాన్య సంస్థ ఆధ్వర్యంలో "అమ్మ పేరుతో ఒకే మొక్క-2"కార్యక్రమంలో భాగంగా కూచిపూడి లో నిర్వహించిన వన మహోత్సవం లో మొక్కలు నాటే కార్యక్రమం నిర్వహించారు. స్థానిక శివాలయం వెనక నాటిన మొక్కల కార్యక్రమంలో సర్పంచ్ కొండవీటి వెంకటరమణ విజయలక్ష్మి అమరబాలేశ్వరరావు దంపతులు ఎంపీడీవో జి విమాదేవి, ఆర్. ఐ.ఏ. విజయ దుర్గ, ఎన్ఆర్ఈజీఎస్ ఈసీ కిరణ్, పంచాయతీ కార్యదర్శి కె పుష్ప నాదం, జూనియర్ అసిస్టెంట్ ఏ రామ్ పణీంద్ర పాల్గొన్నారు.

జేఈఈ అడ్వాన్స్ ఫలితాల్లో శ్రీ చైతన్య విజయకేతనం

విశాలాంధ్ర-విజయవాడ : జేఈఈ అడ్వాన్స్ ఫలితాల్లో శ్రీ చైతన్య విద్యార్థులు విజయకేతనం ఎగురవేశారు. ఈ సందర్భంగా విద్యా సంస్థల ఎజీఎం మురళీకృష్ణ మాట్లాడుతూ ఆలిండియా క్యాటగిరిలో 100లోపు ముగ్గురు విద్యార్థులు డి గంగా రుత్విక్ సాయి 18, పి హేమ సాయి సూర్య కార్తిక్ 26, కె రసగన్య 78 వ ర్యాంకు లు సాధించారని తెలిపారు. ఆల్ ఇండియా ఓపెన్ క్యాటగిరిలో 500లోపు 23మంది, 1000ర్యాంకు లోపు 44మంది విద్యార్థులు సాధించారు. శ్రీ చైతన్య వివిధ స్థాయిలలో పలు ప్రోగ్రామ్స్ నిర్వహించడంతో ఈ విజయం సాధ్యమైందని తెలిపారు. ఈ సందర్భంగా విద్యార్థులను , అధ్యాపకుల బృందాన్ని అభినందించారు.

డ్రగ్స్ కలకలం- ముగ్గురి అరెస్టు

విశాలాంధ్ర-విజయవాడ (క్రైం): విజయవాడలో మరోసారి డ్రగ్స్ కలకలం రేపింది. బుధవారం రాత్రి నిర్వహించిన పోలీసు తనిఖీల్లో అనూహ్యంగా 33గ్రాముల ఎండీఎంఏ బయటపడింది. డ్రగ్స్ సరఫరా చేస్తున్న ముగ్గురు యువకులను పటమట పోలీసులు అరెస్టు చేశారు. వారి వద్ద నుంచి సెల్‌ఫోన్లు, వాహనాలను స్వాధీనం చేసుకున్నారు. గురువారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో డీసీపీ కేజీవి సరిత వివరాలను వెల్లడించారు. రామవరప్పాడు ఫ్లైవోర్ వైపు నుండి విజయవాడ వైపు అనుమానాస్పదంగా వెళుతున్న రెండు వాహనాలను తనిఖీ చేయడం జరిగిందన్నారు. ఇ ఇనుప పెట్టెలో వైట్ కలర్ క్రిస్టల్ ఎండీఎంఏ డ్రగ్స్ ప్యాకెట్లు రెండు, పర్పుల్ కలర్ క్రిస్టల్ ఎండీఎంఏ అడ్రస్ ప్యాకెట్ ఒకటి మొత్తం 33గ్రాముల డ్రగ్స్ లభించిందన్నారు. డ్రగ్స్ సరఫరా చేస్తున్న వారిలో సనత్‌నగర్‌కు చెందిన తిరుమలశెట్టి జీవన్‌కుమార్, టీచర్స్ కాలనీకి చెందిన బొంతు నితీష్‌కుమార్, యనమలకుదురుకు చెందిన తరుణ్‌ప్రసాద్‌లను అదుపులోకి తీసుకున్నారు. నూజివీడుకు చెందిన మనోహర్ ద్వారా ఢిల్లీకి చెందిన రింకు నుండి డీటీడీసీ కొరియర్ల ద్వారా దిగుమతి చేసుకున్నట్లు విచారణ తెలిసిందన్నారు. ఈ డ్రగ్స్ విలువ సుమారు రూ. 2లక్షలు ఉంటుందన్నారు. ప్రభుత్వం మాదక ద్రవ్యాలు రవాణా పై ఉక్కుపాదం మోపుతోందన్నారు. ఎప్పటికప్పుడు తనిఖీలు చేయడం జరుగుతోందన్నారు. దీనిపై పూర్తి విచారణ జరుగుతోందన్నారు. ఈ సమావేశంలో ఏసీపీ దామోదర్, సీఐ పవన్ కిశోర్, సిబ్బంది పాల్గొన్నారు.

CHANGE OF NAME

I, THIRUPATHI RAO PRASAD PALLIKANTI (Old Name) S/o PRASAD PALLIKANTI, Reseident of D.No.6-111, Gudem Madhavaram, Veerulapadu Mandal, NTR District, Andhra Pradesh-521181. I have changed my name as THIRUPATHI RAO PALLIKANTI (New Name) S/o PRASAD PALLIKANTI, here after my name is known as THIRUPATHI RAO PALLIKANTI (New Name) S/o PRASAD PALLIKANTI.

CHANGE OF NAME

I, SANDIPKUMAR LALCHAND JAIN (Old Name) S/o LALCHAND JAIN, Reseident of D.No.12-19-11, Flat No.S2, 3 rd Floor, Sai Ganesh Homes, Yadavalli Vari Street, Kothapeta, Guntur, Guntur District, Andhra Pradesh- 522001. I have changed my name as SANDEEP KUMAR JAIN (New Name) S/o LALCHAND JAIN, here after my name is known as SANDEEP KUMAR JAIN (New Name) S/o LALCHAND JAIN.

యోగాంధ్ర-25ను విజయవంతం చేయాలి : ఆర్డీఓ

విశాలాంధ్ర-కూచిపూడి : కూచిపూడి పెదపూడి జిమ్ ప్రాంగణంలో శుక్రవారం నిర్వహించే యోగాంధ్ర-25 ను విజయవంతం చేసి జిల్లాలోని ఉయ్యూరు డివిజన్ ను అగ్రగామిగా నిలవాలని ఉయ్యూరు ఆర్డిఓ బిఎస్ హెలాషారోన్ పిలుపునిచ్చారు. ఆమె గురువారం సాయంత్రం పెదపూడి లో జిల్లాస్థాయిలో నిర్వహించే యోగాంధ్ర-25 కోసంతీర్చిదిద్దుతున్నజిమ్ ప్రాంగణాన్ని పరిశీలించి సంతృప్తి వ్యక్తపరిచిపలు సూచనలు ఇచ్చారు. కలెక్టర్ డీకే బాలాజీ, ఎమ్మెల్యే వర్లకుమార్ రాజా, డిఆర్ఓ చంద్రశేఖర్ తదితరులు సుమారు 2వేలమందితో నిర్వహించే ఈ కార్యక్రమం భవిష్యత్తులో మధురజ్ఞాపికగా గుర్తుండాలనే ఆశాభావాన్ని వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో తాసిల్దార్ కే మస్తాన్, ఎంపీడీవో జే విమాదేవి, డిప్యూటీ తాసిల్దార్ సిహెచ్ రఘురాం, ఆర్ ఐ ఏ విజయ్ దుర్గ, వీఆర్వోలు పాల్గొన్నారు.

రేపు విద్యుత్ సరఫరా నిలిపివేత

విశాలాంధ్ర-గన్నవరం : విద్యుత్ లైన్లు మరమ్మతు నిమిత్తం గన్నవరం సెక్షన్ గన్నవరం సబ్ స్టేషన్ పరిధిలో 11 కె.వి ఆర్టీసీ ఫీడర్ గురువారం ఉదయం 07:30 గంటలు నుంచి 11:00 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ఏపీ సి పి డి సి ఎల్ గుణదల కార్యనిర్వాహక ఇంజనీర్ పి.హరిబాబు తెలిపారు. శ్రీనగర్ కాలనీ ఏరియా మొత్తం, హరిజనవాడ, గ్యాస్ కంపెనీ ఏరియా, బస్టాండ్ ఏరియా, విద్యా నగర్ మల్లికార్జున స్కూల్ రోడ్డు. మదర్ థెరిస్సా కాలనీ, ఎండిఓ ఆఫీస్ ఏరియా, బుద్ధవరం రోడ్డు, మెయిన్ రోడ్ ఆ ప్రాంతాలలో సరఫరా నిలిపి వేస్తారని, కావున అందరూ సహకరించగలరని వారు కోరారు.

నెట్టెం రఘురాంకు ఘన సన్మానం

విశాలాంధ్ర-ఎ.కొండూరు : కేంద్ర సహకార బ్యాంక్ ఛైర్మెన్ గా ఎన్టీఆర్ జిల్లా తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు నెట్టెం రఘురాం గురువారం విజయవాడ తుమ్మలపల్లి కళాక్షేత్రంలో ప్రమాణ స్వీకారం చేసిన సందర్భముగా ఎ. కొండూరు మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడు గడ్డి కృష్ణారెడ్డి, మండల ప్రధాన కార్యదర్శి వనపర్ల డేవిడ్ రాజు, టిడిపి నాయకులు, పూల బొకే అందజేసి, శాలువాతో ఘనంగా సన్మానించారు. అనంతరం కృష్ణారెడ్డి మాట్లాడుతూ నీతి, నిజాయితీ, నిబద్ధత గల వ్యక్తి నెట్టెం రఘురాం అని, యువకులను పార్టీ లో ప్రోత్సహించడానికి ఎమ్మెల్యే టికెట్ కూడా త్యాగం చేసిన మహోన్నత వ్యక్తి అని, అలాంటి వ్యక్తి ఎంతో మంది నేటి యువకులకు ఆదర్శం అని ,పార్టీకి ఆయన చేసిన సేవలను గుర్తు చేసుకుంటూ ఛైర్మెన్ గా ప్రమాణ స్వీకారం చేసిన సందర్భముగా శుభాకాంక్షలు తెలిపారు.

జీవితానికి యోగా తోడైతే అంతా ఆనందమే

ప్రతిఒక్కరూ యోగాను దినచర్యలో భాగం చేసుకోవాలి : కలెక్టర్ జి.లక్ష్మీశ

విశాలాంధ్ర-విజయవాడ (వన్‌టౌన్): ఎన్టీఆర్ జిల్లాను ఆరోగ్య జిల్లాగా తీర్చిదిద్దేందుకు చేయిచేయి కలుపుదామని.. దీంతో స్వర్ణాంధ్ర సాకారానికి మంచి పునాదులు పడతాయని, జీవితానికి యోగా తోడైతే అంతా ఆనందమేనని జిల్లా కలెక్టర్ డాక్టర్ జి.లక్ష్మీశ అన్నారు. గురువారం విజయవాడ బీఆర్టీఎస్ యోగా స్ట్రీట్‌లో ఆయుష్ శాఖ, జిల్లా అధికార యంత్రాంగం, కాలుష్య నియంత్రణ మండలి, పరిశ్రమలు, విజయవాడ నగరపాలక సంస్థ ఆధ్వర్యంలో ప్రత్యేక యోగా కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమంలో కలెక్టర్ లక్ష్మీశ.. విద్యార్థులు, పరిశ్రమల ప్రతినిధులు, యోగా ఔత్సాహికులు తదితరులతో కలిసి యోగాసనాలు అభ్యసించారు. కార్యక్రమంలో కాలుష్య నియంత్రణ మండలి (పీసీబీ) ఈఈ పి.శ్రీనివాస్, జిల్లా పరిశ్రమల అధికారి బి.సాంబయ్య, డీఎంహెచ్‌వో డా. ఎం.సుహాసిని, వన్ ఎర్త్-వన్ లైఫ్ ప్రతినిధులు ఏలూరి లీలా కుమారి, ఆయుష్ అధికారులు డాక్టర్స్ వి.రాణి, రామత్లేహి, రత్నప్రియదర్శిని, యోగా ట్రైనర్లు సత్యనారాయణ, రామాంజనేయులు, రామ్‌కో, కేసీపీ, అల్ట్రాటెక్, బల్క్ డ్రగ్ ఇండస్ట్రీస్, ఐడీఏ కొండపల్లి, ఐడీఏ జగ్గయ్యపేట ప్రతినిధులు, నర్సింగ్ విద్యార్థినులు తదితరులు హాజరయ్యారు.

వార్డ్, సర్కిల్ స్థాయిల్లో యోగాంధ్ర పోటీలు

విశాలాంధ్ర-విజయవాడ కార్పొరేషన్ : మే 21 నుంచి జూన్ 21వ తేదీ వరకు జరుగుతున్న యోగాంధ్ర మాసోత్సవాల్లో పోటీల్లో భాగంగా నగరంలోని వార్డ్, సర్కిల్ స్థాయి యోగా పోటీలు విజయవాడ మున్సిపల్ కార్పొరేషన్ ఆధ్వర్యంలో జరుగుతున్నట్లు నగరపాలక సంస్థ కమిషనర్ ధ్యానచంద్ర తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వార్డ్ స్థాయి విజేతలు సర్కిల్ స్థాయికి, సర్కిల్ స్థాయి విజేతలు జిల్లా స్థాయికి, జిల్లాస్థాయి విజేతలు రాష్ట్ర స్థాయికి అర్హత సాధిస్తారని తెలిపారు. ఆసనాల ప్రదర్శన(సూర్య నమస్కార్ ఛాలెంజ్, ప్రాణాయామం, మెడిటేషన్), ఆర్టిస్టిక్ యోగా(యోగా సాంగ్, యోగా పెయింటింగ్, యోగా స్కిట్, రోల్‌ప్లే), వైజ్ఞానికి యోగా(యోగా క్విజ్, యోగా పోస్టర్, యోగా స్లోగన్, యోగా ఎస్సే), యోగా షార్ట్‌ఫిల్మ్ యోగా ఫొటోగ్రఫీలో పోటీలు జరుగుతాయని తెలిపారు. గ్రూప్ విభాగంలో సింక్రనైజ్డ్, మిక్స్‌డ్ ఏజ్ గ్రూప్ యోగా పోటీలు నిర్వహిస్తున్నారని తెలిపారు. జూనియర్ గ్రూప్(10-18 ఏళ్లు), యంగ్ గ్రూప్(19-35 ఏళ్లు), సీనియర్ గ్రూప్(35 ఏళ్లు, ఆపైన) కేటగిరీల్లో పోటీలు జరుగుతాయని, వార్డు స్థాయి పోటీలు మే 26 నుంచి 30వ తేదీ వరకు ప్రస్తుతం సర్కిల్ స్థాయిలో యోగ పోటీలు జరుగుతున్నట్లు చెప్పారు. నిపుణులు, యోగ గురువులు న్యాయ నిర్ణేతలుగా వ్యవహరిస్తారని తెలిపారు.

అన్నదానం సేవా మార్గానికి అత్యుత్తమం : ఢిల్లీరావు

విశాలాంధ్ర-విజయవాడ (వన్‌టౌన్): మానవ జీవితంలో భగవంతుని అనుగ్రహం పొందేందుకు ఎన్నో మార్గాలు ఉన్నప్పటికీ వాటిలో అన్నదానం,ధార్మిక కార్యక్రమాల నిర్వహణ ద్వారా భగవంతుని అనుగ్రహం పొందడం అత్యుత్తమ మార్గమని వ్యవసాయ శాఖ కమిషనర్ ఎస్. ఢిల్లీరావు అన్నారు. తాడేపల్లి లోని విజయవాడ క్లబ్ రోడ్ లో గల ఆర్.ఎల్. గౌతమి రివర్ బ్రీజ్ అపార్ట్మెంట్ నివాసితుల ఎన్.ఎస్.వి. ప్రసాద్ నన్నపనేని, రేవతి నన్నపనేని దంపతులు, అక్షయితి, శ్రీహిత, నన్నపనేని కుటుంబ సభ్యుల సహకారంతో తిరుమల తిరుపతి దేవస్థానం నిత్య అన్నదాన నిర్వహణ కోసం పంపుతున్న 10 టన్నుల కూరగాయల వాహనానికి గురువారం ఆయన జండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఢిల్లీరావు మాట్లాడుతూ హిందువులు భక్తిప్రపత్తులతో దర్శించుకునే ఆరాధ్య దైవం, కలియుగ వైకుంఠం ఏడుకొండలపై వెలసిన శ్రీ వెంకటేశ్వర స్వామి వారి దర్శనార్థం వచ్చే భక్తుల కోసం నిర్వహిస్తున్న నిత్యాన్నదాన పథకానికి సాయం చేసే అవకాశం సామాన్యులకు కూడా కల్పించడం ఎంతో ముదావహమన్నారు. కార్యక్రమ నిర్వాహకులు మరడ నాగేంద్ర మాట్లాడుతూ ఇటువంటి మహత్తర కార్యక్రమాన్ని కీర్తిశేషులు మండవ కుటుంబరావు 2006లో ప్రారంభించారని గుర్తు చేశారు. రాష్ట్రంతో పాటు వేసి విదేశాలలోని స్వామివారి భక్తులు గత 18 సంవత్సరాలుగా తిరుమల తిరుపతి దేవస్థానానికి కూరగాయలను వితరణగా అందిస్తున్నారన్నారు.

ఆకుపచ్చని గన్నవరం లక్ష్యం : యార్లగడ్డ

విశాలాంధ్ర-గన్నవరం : నియోజకవర్గంలో పచ్చదనం పెంపొందించేదుకు అత్యంత ప్రాధాన్యతనిస్తున్నట్లు ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావ్ తెలిపారు. గన్నవరం గాంధీ బొమ్మ సెంటర్లో గురు వారం మొక్కలు నాటి వనమహోత్సవాన్ని ప్రారంభిం చారు. జాతీయ రహదారిపై గన్నవరం నియోజవర్గం లోని గ్రామాలు నియోజకవర్గం ప్రారంభ గ్రామమైన రామవరపాడు నుంచి చివరి గ్రామమైన బొమ్మలూరు వరకు పచ్చదనాన్ని పెంపొందిస్తున్నట్లు ఆయన చెప్పారు. రోగుల సౌకర్యార్థం కానూరు శేష మాధవి ఏర్పాటు చేసిన అంబులెన్స్ ను యార్లగడ్డ ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ నిడమర్తి సౌజన్య, బిజెపి నాయకులు చిగురుపాటి కుమారస్వామి, నాదెండ్ల మోహన్, టిడిపి నాయకులు దొంతు చిన్న, ఆళ్ల గోపాలకృష్ణ, మద్దినేని వెంకటేశ్వరరావు, కొమ్మరాజు సుధీర్, మేడేపల్లి రమ, మొవ్వ వెంకటేశ్వరావు, కొమ్మారెడ్డి రాజేష్, ఆరుమళ్ళ కృష్ణారెడ్డి, గొడ్డళ్ళ చిన్న రామారావు, మూల్పూరి సాయి కళ్యాణి, పడమట రంగారావు, పాలడుగు మల్లికార్జునరావు, యానమదల సతీష్ తదితర టిడిపి నాయకులు అధికారులు పాల్గొన్నారు.

ఆపరేషన్ బుడమేరు అమలుకు ఎందుకు జాప్యం?

గత ఏడాది సెప్టెంబర్ మొదటివారంలో విజయవాడ సగం నగరాన్ని అనూహ్యంగా ముంచెత్తిన బుడమేరు వరద నేపథ్యంలో 'ఆపరేషన్ బుడమేరు'చేపట్టనున్నట్టు ప్రభుత్వం ప్రకటించినప్పటికీ ఆచరణలో కార్యరూపం దాల్చకపోడం పట్ల విజయవాడ ప్రజలు ఆందోళన చెందుతున్నారు. మైలవరం కొండల్లో పుట్టి విజయవాడ మీదుగా కొల్లేరులో కలిసే బుడమేరు, వరదల సమయంలో తప్పించి మిగతా రోజుల్లో చాలాచోట్ల చిన్నపాటి మురుగు కాలువలాగానే కనిపిస్తుంది. కానీ, భారీ వర్షాలు వచ్చినప్పుడు ఒక్కసారిగా ఉగ్రరూపం చూపిస్తుంది. 60 ఏళ్ల కిందట ఓసారి, 2005లో మరోసారి, మళ్లీ 2024 లో అంతకు మించిన స్థాయిలో విజయవాడ పై విరుచుకు పడిన బుడమేరు నగర ప్రజల జీవితాలను అతలాకుతలం చేసింది. దాదాపు 4 లక్షలమందిపై ప్రభావం చూపించింది. సహజంగానే సరైన తీరు తెన్నూ లేకుండా ప్రవహించే బుడమేరుకు ఇష్టారాజ్య ఆక్రమణల ఫలితంగా హద్దులు పూర్తిగా మారిపోయాయి. బుడమేరు సరిహద్దులపై అధికారుల వద్దనే పక్కా సమాచారం లేకపోవడంపై వరదల సమయంలో జరిగిన అధికారిక సమావేశంలో మంత్రి నిమ్మల రామానాయుడు అసహనం వ్యక్తం చేసిన సంగతి అందరికీ తెలిసిందే. రెవెన్యూ లాండ్ సర్వే అధికారుల వద్ద డిజిటల్ మ్యాపులు ఉంటాయని, వాటిలో బుడమేటి సరిహద్దులు స్పష్టంగా తెలుస్తాయని జలవనరుల శాఖ అధికారుల అభిప్రాయం. వాటి ఆధారంగా ఆక్రమణలు సులభంగా గుర్తించవచ్చు. వెలగలేరు హెడ్ రెగ్యులేటర్ నుంచి గొల్లపూడి మీదుగా విద్యాధరపురం, గుణదల, రామవరప్పాడు, ప్రసాదంపాడు ఎనికేపాడు వరకు బుడమేరు ప్రవహిస్తోంది. విజయవాడ నగర పరిధిలోనే దాదాపు తొమ్మిది కిలోమీటర్ల మేర బుడమేరు ప్రవాహం ఉంది. విజయవాడ రూరల్ లో 10.2 కిలోమీటర్ల మేర ప్రవహిస్తోంది. ఎ.కొండూరు నుంచి విజయవాడ వరకు 40 గ్రామాల పరిధిలో సుమారు 2700 ఎకరాల్లో బుడమేరు ప్రవహిస్తుండగా దాదాపు 270 ఎకరాల మేర ఆక్రమణలకు గురయింది. మైలవరం చుట్టుపక్కల వున్న కొండల్లో పుట్టే బుడమేరు 160 కిలోమీటర్ల ప్రయాణం తర్వాత కొల్లేరులో కలుస్తుంది. 1960 కి పూర్వం ఈ మెట్ట ప్రాంతాల్లో నిలబడిన నీటి వల్ల పొలాలకు జరిగే నష్టం గురించి ఎవరు పట్టించుకునేవారు కాదు. విజయవాడ నగరం బాగా విస్తరించిన తర్వాత బుడమేరు ప్రాంతంలో ఇళ్ళు పెరిగాయి. ఆక్రమణలు పెరిగాయి. 1964లో కృష్ణా, గోదావరి డెల్టాలో వున్న మురుగు నీటి సమస్య మీద ఏ.సి. మిత్ర కమిటీ వేశారు. వెలగలేరు దగ్గర బుడమేరు పైన ఒక రెగ్యులేటర్ నిర్మించి అక్కడి నుంచి కృష్ణానదిని కలుపుతూ ఒక కాల్వ నిర్మించి బుడమేరులో వచ్చే నీటిని తరలించాలని అప్పుడు ఈ మెట్ట ప్రాంతాల ముంపు తగ్గించవచ్చని ఈ కమిటీ సిఫారసు చేసింది. దీని ప్రకారం రెగ్యులేటర్ నిర్మించి ముందుగా 7500 క్యూసెక్కుల నీరు తరలించేందుకు బుడమేరు డైవర్షన్ ఛానల్ నిర్మాణం చేశారు. తర్వాత దీన్ని 15000 క్యూసెక్కులకు వెడల్పు చేశారు. విజయవాడలో బుడమేరు వాగుకు రెండు పక్కల ఆక్రమణలు పెరిగి ఇళ్ల నిర్మాణం జరగటంతో ముంపు సమస్య మళ్ళీ పెరిగింది. బుడమేరు చానల్ అంతా విజయవాడలో ఇళ్ల మధ్య నుంచే ప్రవహిస్తోంది. నగరంలోని ఏలూరు కాలువ, బుడమేరుకు ఒక గట్టు ఉమ్మడిగా ఉంటుంది. ఆ ఉమ్మడి గట్టుపైన రెండు వేల కట్టడాలకు పైగా వున్నాయి. నిరుపేదలు ఇళ్ల స్థలాలు కొనుగోలు చేయలేక బుడమేటి గట్ల వెంబటి ఆక్రమించుకొని ఇళ్లు కట్టుకోవడం 60 ఏళ్ల కిందటే మొదలైంది. ఆ తర్వాత బుడమేరును మరింత చిన్నదిగా చేస్తూ చిన్న మధ్య తరగతి ఇళ్ల నిర్మాణాలు, కాలనీలు వెలిశాయి. విజయవాడలో బల్లపరుపు ప్రాంతాల కంటే కాల్వ గట్ల మీద, కొండ ప్రాంతాల మీద ఉండే జనాభా ఎక్కువ అని గతంలో ఓ లెక్క ఉండేది. దాదాపు మూడు లక్షల మంది ఇలా గట్ల వెంబడి ఉంటారు. ఇక అయోధ్యానగర్, నందమూరి నగర్ మొదలు బుడమేరులోనే ఎన్నో వందల ఇళ్లు, పదుల సంఖ్యలో కాలనీలు వెలిశాయి.

పోలవరం కుడి కాలువ ప్రకాశం బ్యారేజ్ కి ఎగువన కృష్ణానదిలోకి నీటిని సరఫరా చేయవలసి వచ్చినప్పుడు ఈ బుడమేరు డైవర్షన్ ఛానల్ 15వేల నుంచి 35 వేల క్యూసెక్కులకు వెడల్పు చేయాలని ప్రయత్నం చేశారు. వెలగలేరు నించి కొంత దూరం 35 వేల క్యూసెక్కులకు విస్తరించారు. దిగువన విస్తరించటానికి విజయవాడ థర్మల్ స్టేషన్ మధ్యలో పని చేయడానికి ఆటంకాలు ఏర్పడ్డాయి. ఈ కాలువలో థర్మల్ స్టేషన్ నుంచి విడుదల అయ్యే మరుగుతున్న నీరు కృష్ణా నదికి పంపుతున్నారు. వెడల్పు చేయడానికి స్థలాభావం సమస్య కూడా ఉంది. ఇప్పుడు పోలవరం కుడి కాలువ నుంచి అదనంగా 17 వేల క్యూసెక్కుల నీరు వచ్చి చేరితే పరిస్థితి మరింత కఠినంగా మారే ప్రమాదం ఉంది. బుడమేరుకు సమాంతరంగా వెలగలేరు రెగ్యులేటర్ నుంచి పాముల కాలవ ఉంది. ఆ కాలువ అవసరాన్ని బట్టి విస్తరించి ఆ నీటిని ముస్తాబాద్ కాలువలోకి తీసుకువెళ్లేందుకు ఉన్న అవకాశాన్ని అధికారులు పరిశీలించాలి. ముస్తాబాద్ కాలువని వెడల్పు చేసి ఆ నీరంతా ఎనికేపాడు మీదుగా తిరిగి బుడమేరులో కలిసేందుకు కూడా ఆలోచించవచ్చని నిపుణులు చెబుతున్నారు. కృష్ణలంక వద్ద కృష్ణానది ఒడ్డున కట్టిన రిటైనింగ్ వాల్ తరహాలో బుడమేటికి కూడా రిటైనింగ్ వాల్ నిర్మించేలా చూడాలని, విజయవాడలోకి బుడమేరు ప్రవేశించకుండా కొత్త చానల్ నిర్మాణం మీద కూడా దృష్టి పెట్టాలనే వామపక్షాల డిమాండ్ ను ప్రభుత్వం ఆలోచించాలి. బుడమేరు వరదలకు ప్రధాన కారకులు పాలకులు, ప్రజల నిర్లక్ష్యం. ఏరు ప్రవాహ మార్గాన్ని సంవత్సరాల తరబడి పూడికలు తీయకుండా, కబ్జాలు చేసి, కలవాల్సిన కొల్లేరును అడ్డుకోవడం సరైన పని కాదు అని వరదల మనల్ని హెచ్చరిస్తున్నాయి. అందుకే బుడమేరు ఆధునీకరణ వెంటనే ప్రభుత్వం చేపట్టాలి.

- దోనేపూడి శంకర్,
కార్యదర్శి, సిపిఐ, ఎన్టీఆర్ జిల్లా

పర్యాటక ప్రాంతంగా పులిగడ్డ ఆక్విడెక్టు అభివృద్ధి

విశాలాంధ్ర-అవనిగడ్డ: పులిగడ్డ ఆక్విడెక్టును పర్యాటక ప్రాంతంగా అభివృద్ధి చేస్తున్నట్లు ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ తెలిపారు. గురువారం మోపిదేవి వార్పు వద్ద 'ఐ లవ్ దివిసీమ' నూతన బోర్డులను, ఉద్యానవనాన్ని ఎమ్మెల్యే ప్రారంభించారు. మండలి యుగంధర్ ఆర్థిక సహకారం రూ.40వేలతో ఈ ఉద్యానవనంలో అశోక, బ్లాక్ పాండా, రెడ్ మిర్చి, స్టెప్ ట్రీ, ఫోస్టయిన్ మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బ్రిటిష్ వారి కాలం నుంచి ఒకవైపు కృష్ణానది, మరోవైపు దివిసీమకు సాగునీరు అందించే ఆక్విడెక్టులతో ప్రకృతి రమణీయతకు నిలయంగా ఈ ప్రాంతం ఉండేదన్నారు. గత ఐదేళ్లలో కనీస నిర్వహణ లోపం, పాలకుల నిర్లక్ష్యంతో కళా విహీనంగా తయారైందన్నారు. తిరిగి కూటమి ప్రభుత్వంలో ఒకవైపు రూ.కోటీ పది లక్షలతో పులిగడ్డ ఆక్విడెక్ట్ సమగ్ర అభివృద్ధి, మరో వైపు వార్పు వద్ద జాతీయ రహదారిపై, కృష్ణా డబుల్ లైన్ కరకట్టపై వెళ్లే ప్రయాణికులకు, పర్యాటకులకు ఆహ్లాదభరిత వాతావరణం కనిపించేలా ఐ లవ్ దివిసీమ బోర్డులు, ఉద్యానవనం ఏర్పాటు చేసి మొక్కలు నాటినట్లు తెలిపారు. ఈ ఉద్యానవనంలో త్వరలో పూలమొక్కలు కూడా నాటించి, ట్రాక్ ఏర్పాటు చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ యువ నాయకులు మండలి వెంకట్రామ్, ప్రాజెక్టు కమిటీ చైర్మన్ దేవనబోయిన వెంకటేశ్వరరావు, డీసీ వైస్ చైర్మన్ బచ్చు రఘునాథ్ ప్రసాద్, ఇరిగేషన్ శాఖ డీఈఈ ఎస్.అరుంధతి, ఏఈఈలు పొన్నూరు రవితేజ, దోవారి విజయ్ కుమార్, తానేటి ప్రసాద్, మొక్కల దాత మండలి యుగంధర్, కూటమి నాయకులు బండే రాఘవ, మండలి శేషు, మండలి శివప్రసాద్, మండలి సుధీర్, చెన్ను గాంధీ, నాగిడి రాంబాబు, మండలి రామకోటి, ఇరిగేషన్ శాఖ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

మనకు ఆక్సిజన్ అందించే చెట్లను సంరక్షించుకోవాలి

విశాలాంధ్ర-విజయవాడ కార్పొరేషన్ : మనకు ఆక్సిజన్ అందించే చెట్లను సంరక్షించుకోవాలని తూర్పు ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్‌రావు పిలుపునిచ్చారు. ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకొని నగరపాలక సంస్థ ఆధ్వర్యంలో స్థానిక లయోలా కాలేజ్ రోడ్డులో శుక్రవారం జరిగిన ప్రపంచ పర్యావరణ దినోత్సవ వేడుకల్లో ఎమ్మెల్యే పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సీఎం చంద్రబాబునాయుడు ఆదేశాల మేరకు నిర్వహిస్తున్న ప్రపంచ పర్యావరణ దినోత్సవంలో భాగంగా ఈ సంవత్సరం ప్రధాన అంశం ప్లాస్టిక్ పెను భూతాన్ని తరిమేసి నగరాన్ని కాలుష్య రహిత నగరంగా ఉంచనున్నట్లు తెలిపారు. పశ్చిమ నియోజకవర్గంలో హెచ్‌బి కాలనీ కరెంట్ ఆఫీస్, సెంట్రల్ నియోజకవర్గం పాయకాపురం చెరువు వద్ద అవగాహన కార్యక్రమం నిర్వహించి ప్రజలకు అవగాహన కల్పించామని అన్నారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్లు జాస్తి సాంబశివరావు, ముమ్మనేని వెంకటప్రసాద్, చెన్నుపాటి ఉషారాణి, అడిషనల్ కమిషనర్ డాక్టర్ డాక్టర్ చంద్రశేఖర్, ప్రాజెక్ట్ ఆఫీసర్(యూసీడి) పి.వెంకట్ నారాయణ, జోనల్ కమిషనర్ కే.షమీ, ఇంచార్జి చీఫ్ మెడికల్ హెల్త్ ఆఫీసర్ డాక్టర్ గోపాలకృష్ణ నాయక్, ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ జీ సామ్రాజ్యం, మెప్మా ఎ.ఎం.డి కే. ఎన్. వెంకటేశ్వరరావు సిబ్బంది పాల్గొన్నారు.

మొవ్వ ఏఎంసీ చైర్మన్‌గా దోనేపూడి బాధ్యతలు

విశాలాంధ్ర-కూచిపూడి : 'దోనేపూడి శివరామయ్య అను నేను..' అంటూ మొవ్వ ఏఎంసి చైర్మన్‌గా బీజేపీ నాయకుడు దోనేపూడి శివరామయ్య గురువారం బాధ్యతలు చేపట్టారు. ఆయన మొవ్వ ఏఎంసి గౌరవ అధ్యక్షులు ఎమ్మెల్యే వర్లకుమార్‌రాజా సమక్షంలో ఏఎంసి కార్యదర్శి ఎస్ అక్బర్ భాషా ప్రమాణ స్వీకారం చేయించారు. వైస్ చైర్మన్ గా ఎస్ కిరణ్, సభ్యులుగా ఆలూరి రుక్మిణమ్మ, బొమ్మా రెడ్డి సంధ్యారాణి, గంజాల దుర్గమ్మ, గరికేమంగమ్మ, గొంతుపులిసుజాత, మట్టా మోహన్,మీర్జా సర్వర్.అబ్బాస్, పాముల ప్రకాష్ రావు, పోలనఅశోక్ కుమార్, చలసాని శ్రీదివ్య, వీరంకి రాజ్యలక్ష్మి, వై పిచ్చి ఈశ్వరరావు, ఎల్ శివరామకృష్ణ బాధ్యతలు చేపట్టారు. కోఆప్షన్. చేసిన సభ్యులుగా కూచిపూడి సర్పంచ్ కొండవీటి వెంకటరమణ విజయలక్ష్మి, మొవ్వ వ్యవసాయ శాఖ సహాయ సంచాలకులు సూరపనేని శ్యామల హాజరైనారు అలాగేతోట్లవల్లూరు పిఎసిఎస్ అధ్యక్షులు(నియమించాల్సి ఉంది) కూడా సభ్యులుగా కొనసాగుతారు. ఈ కార్యక్రమంలో మండల టిడిపి అధ్యక్షులు లింగమనేని రామలింగేశ్వర రావు, కృష్ణాజిల్లా టిడిపి ఉపాధ్యక్షులు నన్నపనేని వీరేంద్ర, పామర్రు నియోజకవర్గ జనసేనసమన్వయకర్త తాడిశెట్టి నరేష్, కొడాలి ఏఎంసీ చైర్పర్సన్ కనకదుర్గ, వైస్ చైర్మన్ అత్తలూరు గోపీచంద్, మొవ్వ సూపర్‌వైజర్ కే శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

పర్యావరణం ప్రతి ఒక్కరి బాధ్యత

విశాలాంధ్ర, విస్సన్నపేట టౌన్: అంతర్జాతీయ పర్యావరణ దినోత్సవాన్ని మండలంలో అధికారులు, అధికారపార్టీ నేతలు గురువారం నిర్వహించారు. అన్ని గ్రామాల్లోని ప్రభుత్వ కార్యాలయాల ఆవరణల్లో మొక్కలు నాటారు. తహశీల్దారు కె.లక్ష్మీకల్యాణి, ఎంపీడీవో సిహెచ్.చిన్నరాట్నాలు విస్సన్నపేట 1, 3 సచివాలయాలు, అంగన్‌వాడీ కేంద్రంలో మొక్కలు నాటారు. సర్పంచి ఎస్.నాగమల్లేశ్వరి అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో గ్రామీణాభివృద్ధి అధికారి గోపాలకృష్ణ, కూటమి నేతలు ఆకుల రాధాకృష్ణ, ఆకుల సత్యనారాయణ, రామినేని రామారావు, అడపా శ్రీనివాసరావు, తోట కృష్ణ కిశోర్, మౌనిక, గ్రామ ప్రముఖులు సాధుపాటి కోటేశ్వరరావు పాల్గొన్నారు.

అక్రమ తవ్వకాలతో చెరువుల ఉనికికి ముప్పు

విశాలాంధ్ర-విస్సన్నపేట : విస్సన్నపేట మండలంలో అక్రమంగా సాగుతున్న మట్టి తవ్వకాల కారణంగా సాగునీటి చెరువుల ఉనికికి ముప్పు వాటిల్లుతోందనే ఆందోళన రైతుల నుంచి వ్యక్తమవుతోంది. స్థానికంగా దిగువ, మధ్యతరగతి గృహ నిర్మాణాలకు తక్కువ ధరలో మట్టి తరలించుకునేందుకు అధికారులు కొంతమేర అవకాశం కల్పించినట్లు తెలుస్తోంది. స్థానిక పుత్రేల రోడ్డులోని తెలికల కుంట చెరువులో సాగుతున్న మట్టి తవ్వకం పనులను పరిశీలించగా, కట్టకు దిగువలో పొక్లెయిన్ యంత్రంతో తవ్వకాలు సాగుతున్నాయి. ఇక్కడ తవ్విన మట్టిని విస్సన్నపేటలో రెండుచోట్ల ఏర్పాటు చేసిన రియల్ ఎస్టేట్ వెంచర్లకు తరలిస్తున్నారు.

ఘనంగా ప్రపంచ పర్యావరణ దినోత్సవం

విశాలాంధ్ర-ఏ కొండూరు : ప్రపంచ పర్యావరణ దినోత్సవ సందర్భంగా ఏ కొండూరు మండలంలోని 21 గ్రామపంచాయతీలో ఎన్ ఆర్ జి ఎస్ ఆధ్వర్యంలో మొక్కలను నాటారు ఈ కార్యక్రమంలో భాగంగా మండల పరిషత్ కార్యాలయం తహసిల్దార్ కార్యాలయం లో బుధవారం మండల పరిషత్ అభివృద్ధి అధికారి బి. శ్రీనివాసరావు పాల్గొని మొక్కను నాటారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పర్యావరణహితంలో ప్రతి ఒక్క పౌరుడు భాగస్వామ్యం అవ్వాలని మానవ జీవితంలో మొక్కలు కూడా భాగస్వామ్యమేనని మొక్క లేనిదే మనుగడ లేదని ఆయన అన్నారు మొక్కలు నాటడంతో పర్యావరణంలో సమతుల మార్పులు ఉంటాయని వర్షాలు మెండుగా పడతాయని వర్షాలు పడటం వల్ల పంటలు అత్యధికంగా పండుతాయని మొక్కలు వల్ల స్వచ్ఛమైన గాలి మానవాళికి అందుతుందని ఆయన అన్నారు మొక్కల్ని నాటడమే కాకుండా ప్రతి ఒక్కరు కూడా బాధ్యతాయుతంగా మొక్కల సంరక్షణను చూసుకోవాలని ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో ఏపీవో అనురాధ మండల విద్యాశాఖ అధికారి కేశవరావు, పీహెచ్సీ సూపర్వైజర్ బాలమురళీకృష్ణ పాల్గొన్నారు.

పర్యావరణాన్ని కాపాడుకుందాం : ఆర్డీవో

విశాలాంధ్ర-కూచిపూడి : గ్రామాలలోనేకాకుండా ప్రభుత్వ కార్యాలయాల్లో మొక్కలు నాటి పర్యావరణాన్ని కాపాడుకుంటూ ప్రభుత్వ లక్ష్యానికి సహకరించాలని ఉయ్యూరు ఆర్డీఓ బిఎస్ హెలాషారోన్ పిలుపునిచ్చారు. ఆమె గురువారం సాయంత్రం కూచిపూడి సచివాలయ పరిధిలోని కార్యాలయాల ప్రాంగణంలో మొక్కలు నాటారు. తహశీల్దార్ కే మస్తాన్, ఎంపీడీవో జి విమాదేవి, డిప్యూటీ తాసిల్దార్ సిహెచ్ రఘురాం, ఆర్ ఐ కె విజయ దుర్గ, పంచాయతీ కార్యదర్శి కే పుష్ప నాదం, వీఆర్వో ఏం ఖాసిం తదితరులు పాల్గొన్నారు.

పచ్చని చెట్లు ప్రగతికి మెట్లు : ఆర్డిఓ

విశాలాంధ్ర-నందిగామ :- పచ్చని చెట్లే ప్రగతికి ఉపాయం మార్గాలని ఆర్డిఓ కే బాలకృష్ణ అన్నారు గురువారం ప్రపంచ పర్యావరణ దినోత్సవం, వన మహోత్సవం - 2025 సందర్భంగా నందిగామ రెవిన్యూ డివిజనల్ అధికారి వారి కార్యాలయంలో కే బాలకృష్ణ సిబ్బందితో కలిసి మొక్కలు నాటారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ సురేష్, డివిజనల్ ఇన్‌స్పెక్టర్ అఫ్ సర్వేయర్, డిప్యూటీ స్టాటికల్ ఆఫీసర్,ఆర్డీవో కార్యాలయ ఏవో మరియు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

పర్యావరణ పరిరక్షణకు మొక్కలు నాటండి

విశాలాంధ్ర-పమిడిముక్కల: పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ మొక్కలు నాటాలని మండలంలోని సర్పంచులు అన్నారు. గురువారం ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా చోరగుడి శ్రీరంగపురం తదితర గ్రామాల్లో ర్యాలీ చేసి మొక్కలు నాటారు.

ఆక్సిజన్ అందించే మొక్కలను పెంచాలి : డీఆర్ఎం

విశాలాంధ్ర-విజయవాడ (గాంధీనగర్) : ఆక్సిజన్ అందించే మొక్కలను నాటడంతో భవిష్యత్తు తరాలకు మంచి ఆరోగ్యాన్ని అందించాలని, ప్లాస్టిక్ కాలుష్యాన్ని అరికట్టడానికి వాడకాన్ని తగ్గించాలని విజయవాడ డివిజన్ డివిజనల్ రైల్వే మేనేజర్ నరేంద్ర ఎ.పాటిల్ పిలుపునిచ్చారు. గురువారం ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని పురష్కరించుకుని ఈ ఏడాది ప్రపంచ థీమ్ 'ప్లాస్టిక్ కాలుష్యాన్ని అరికట్టండి' అనే లక్ష్యాన్ని బలోపేతం చేయడానికి అనేక పర్యావరణ కార్యక్రమాలు, ప్రజా భాగస్వామ్య కార్యకలాపాలను రైల్వేస్టేషన్ వద్ద డిఆర్ఎం అధ్వర్యంలో ప్రారంభించారు. రైల్వే స్టేషన్‌లోని క్లాక్ టవర్ వద్ద రైల్వే సిబ్బంది, అధికారులు, భారత్ స్కౌట్స్& గైడ్స్,వాలంటీర్లతో ర్యాలీ నిర్వహించారు. గాంధీ వెయిటింగ్ హాల్‌లో, భారత్ స్కౌట్స్ & గైడ్స్ ప్రదర్శించిన నుక్కడ్ నాటకం (వీధి నాటకం) ప్రయాణికులను అలరించింది. ఈ ప్రదర్శన ప్లాస్టిక్ వాడకం వల్ల కలిగే ప్రమాదాలను మరియు పర్యావరణంపై దాని హానికరమైన ప్రభావాలను నాటకీయంగా చూపించింది, సమిష్టి పౌర బాధ్యతకు పిలుపునిచ్చింది. డిఆర్ఎం మాట్లాడుతూ డివిజన్‌వ్యాప్తంగా పర్యావరణ అనుకూల చర్యలను హైలైట్ చేశారు. పర్యావరణాన్ని కపడటానికి డివిజన్ వ్యాప్తంగా ప్లాస్టిక్ బాటిల్ క్రషర్లతో కూడిన 26 స్టేషన్లలో చెత్తబుట్టలను ఏర్పాటు చేశారు. డివిజన్ అంతటా 213 వర్షపు నీటి సంరక్షణ గుంతలు, 2.814 ఎమ్‌డబ్ల్యూపి పునరుత్పాదక ఇంధన సామర్థ్యం స్థాపించబడింది 66 నీటి కియోస్క్‌లు, బాటిల్ వాటర్‌పై ఆధారపడటాన్ని తగ్గిస్తాయి. అనంతరం కృష్ణ కెనాల్ వద్ద ఉన్న శిక్షణా సంస్థలో దాదాపు 1500 మొక్కలతో భారీ మొక్కలు నాటే కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సీనియర్ డిఎన్వైఎంటీ ఎం.కిషోర్, సీనియర్ డివిజనల్ ఇంజనీర్ (కో-ఆర్డినేషన్) ఎస్. వరుణ్ బాబు, సిబ్బంది, పాల్గొన్నారు.

సింగిల్ యూజ్ ప్లాస్టిక్ నిషేధానికి పటిష్ట చర్యలు: మేయర్

విశాలాంధ్ర - గుంటూరు కలెక్టరేట్ : పర్యావరణ పరిరక్షణకు సింగిల్ యూజ్ ప్లాస్టిక్ విని యోగం తగ్గించుకొని, ప్రత్యామ్నాయంగా గుడ్డ లేదా జనపనార సంచులను వినియోగించాలని నగర మేయర్ కోవెలమూడి రవీంద్ర నగర ప్రజలను కోరారు. ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భం గా గురువారం నగర కమిషనర్ పులి శ్రీనివాసులు, శాసనసభ్యులు మహ్మద్ నసీర్, గల్లా మాధవి, ఏపీఐడీసీ చైర్మన్ డేగల ప్రభాకర్, డిప్యూటీ మేయర్ షేక్ సజీలా, అధికారులు, కార్పొరేటర్లు కలిసి స్థానిక కన్యకా పరమేశ్వరి అమ్మవారి దేవాలయం నుంచి అవగాహన ర్యాలీ, మాస్ క్లీనింగ్ చేపట్టి, జీఎంసీ పార్కింగ్ ప్రాంతంలో మొక్కలు నాటి, ప్రజారోగ్య కార్మికులకు జీఎంసీ చేపట్టిన ఉచిత మెడికల్ క్యాం ప్‌ని ప్రారంభించి, హాజరైన ప్రజలకు ఐటీసీ వారు అం దించిన గుడ్డ సంచులను పంచి, స్వచ్ఛ హరితాంధ్ర కోసం కట్టుబడి ఉంటామని ప్రతిజ్ఞ చేసి, గాంధీ పార్క్ దగ్గర రూ.20లకు గుడ్డ సంచులను ఇచ్చే కియాస్క్ మెషిన్‌ని, ప్లాస్టిక్, ఈ-వేస్ట్ కలెక్షన్ పాయింట్స్‌ని ప్రారంభించారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లా డుతూ పర్యావరణ పరిరక్షణలో ప్రభు త్వంతోపాటుగా ప్రజలు కూడా భాగస్వా ములు కావాలన్నారు. గుంటూరు నగర పాలక సంస్థ తరుపున సింగిల్ యూజ్ ప్లాస్టిక్ నిషేదంకు పటిష్ట చర్యలు తీసు కుంటామని, అందులో భాగంగా ప్రజ లకు ప్రత్యామ్నాయంగా గుడ్డ సంచులను అందించే యంత్రాలను నగరంలోని ప్రధాన కేంద్రాల్లో ఏర్పాటు చేస్తామని తెలిపారు. పర్యావరణ పరిరక్షణకు ప్లాస్టిక్ వినియోగం నిషేధం తప్పనిసరి అని, గుం టూరు నగర పౌరులు బాధ్యతగా నిషేధాన్ని అమలు చేయాలని కోరారు. కార్యక్రమంలో అదనపు కమిష నర్ చల్లా ఓబులేసు, చెలికాని సీతారామయ్య తదితరులు పాల్గొన్నారు.

మంచితనానికి మారుపేరు పద్మావతి

- ఆంధ్రప్రదేశ్ ప్రజానాట్యమండలి జిల్లా ప్రధాన కార్యదర్శి భైరాపట్నం రామకృష్ణ

విశాలాంధ్ర - పెదకూరపాడు : మంచితనం మారు పేరుగా కమ్యూనిస్టు కార్యక్రమాలలో మమేకమవుతూ మంచి ఆలోచన సరళి గల కమ్యూనిస్టు పార్టీ మహిళా నాయకురాలు మునగోటి పద్మావతి సంస్మరణ సభ గురువారం పెదకూరపాడు మండల పరిధిలోని 75 త్యాళ్లూరు గ్రామంలో నిర్వహించారు. ఆంధ్రప్రదేశ్ ప్రజానాట్యమండలి రాష్ట్ర సహాయ కార్యదర్శి ఆరేటి రామారావు, ఆంధ్ర ప్రదేశ్ ప్రజానాట్యమండలి పల్నాడు జిల్లా ప్రధాన కార్యదర్శి బైరాపట్నం రామకృష్ణ, వర్ధమాన సినీనటులు వి.చెన్నకేశవులు విప్లవ సినీ గేయ రచయిత దేవరకొండ శ్రీనివాసరావు, జిల్లా ప్రజానాట్యమండలి జిల్లా సహాయ కార్యదర్శి ఎన్కే చిన్న సైదా, రంగస్థలం నటులు, ప్రజానాట్య మండలి నాయకులు పోత్తూరి రామకోటేశ్వరరావు, సంగీతరావు, రాజారెడ్డి, కె.కేశవరావు తదితర గాయకులు మునగోటి పద్మావతి సంస్మరణ సభలో అనేక విప్లవ గేయాలు ఆలపించారు ఈ సందర్భంగా ఆమె కమ్యూనిస్టు పార్టీ ఆశయాలకు అనుగుణంగా చేసిన కార్యక్ర మాలపై పాటలు వ్రాసి ప్రజానాట్యమండలి కళాకారులు గీతాలు ఆల పించారు. వేదికపై దర్శి శేషారావు, సీపీఐ నాయకులు చల్లపల్లి పానయ్య, పి.నాగేశ్వరరావు, కారంపూడి చెన్నకేశవరావు తదితరులు పద్మావతి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. మాట, పాట కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో పెదకూరపాడు నియోజకవర్గ సీపీఐ కార్యదర్శి, పద్మావతి భర్త మునగోటి శ్రీనివాసరావు, వారి కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

పర్యావరణం పరిరక్షణ అందరి బాధ్యత

విశాలాంధ్ర - పొన్నూరు : ప్రపంచ పర్యావరణ దినోత్సవం-వన మహోత్సవం సందర్భంగా పొన్నూరు మండలం కసుకర్రు, పచ్చల తాడిపర్రు గ్రామాలలో గురువారం వన మహోత్సవ కార్యక్రమం జరిగింది. పొన్నూరు నియోజకవర్గ ఎమ్మెల్యే ధూళిపాళ్ళ నరేంద్ర కుమార్ సూచనల మేరకు జరిగిన ఈ కార్యక్రమంలో కూటమి శ్రేణులు మండల టీడీపీ నాయకులు పాల్గొని మొక్కలను నాటారు. పర్యావరణ సమతుల్య తను కాపాడేందుకు ప్రతి ఒక్కరూ మొక్కలు నాటాలని వారు సూచిం చారు. కన్నతల్లి లాంటి పుడమితల్లిని కాపాడుకుందాం, పర్యావరణ పరిరక్షణను ప్రతి ఒక్కరం బాధ్యతగా తీసుకుందాం. ప్రకృతికి హాని కలిగించే ప్లాస్టిక్ ను విడనాడదాం..వన మహోత్సవంలో ప్రతి ఒక్కరం భాగస్వాములవుదాం.. మన పర్యావరణాన్ని మనమే కాపాడుకుందాం.. ప్రతి ఒక్కరూ కూడా తప్పకుండా మొక్కలను పెంచాలి..కలుషితం లేని వాతావరణాన్ని ఆస్వాదించాలని కోరారు. కార్యక్రమంలో పొన్నూరు నియోజకవర్గ ఎలక్షన్ పోల్ మేనేజ్మెంట్ కోఆర్డినేటర్ మాదాల వెంకటే శ్వరరావు, రాష్ట్ర ఎస్సీ కార్పొరేషన్ డైరెక్టర్, పొన్నూరు మండల పార్టీ అధ్యక్షులు బండ్లమూడి బాబురావు, గుంటూరు పార్లమెంటు రైతు విభాగ ప్రధాన కార్యదర్శి బొర్రా రామారావు, నీటి సంఘ డిసి అధ్యక్షులు గనిపి శెట్టి రామకృష్ణ, మండల నాయకులు సోపాటి వెంకట్రావు, పొన్నూరు ఎంపీడీఓ గుమ్మడి చంద్రశేఖరరావు, ఉపాధి హామీ పథకం ఏపీఓ సుభాషిణి, టెక్నికల్ అసిస్టెంట్ రత్నరాజు, చలమశెట్టి సీతారామయ్య, అరమండ విజయ్ కుమార్, బొప్పన బాపనయ్య, యలవర్తి శేషు, పసుపులేటి సుబ్బారావు, యంపరాల గోపి, దాసరి మహాకాళేశ్వరరావు, శ్రీనివాసరావు, కోటయ్య, సాంబయ్య, రవి, కూటమి ప్రభుత్వ నాయకులు, ప్రభుత్వ సిబ్బంది పాల్గొన్నారు.

ధ్యాన సాధకులు డాక్టర్ శ్యామలరావుకు ఘన సన్మానం

విశాలాంధ్ర - మంగళగిరి : ధ్యాన బోధన సామాజిక సేవకు గుర్తింపుగా గ్లోబల్ హ్యూమన్ పీస్ యూనివర్సిటీ వారిచే గౌరవ డాక్టరేట్ అందుకున్న కొసనం కోట నాగశ్యామలరావు మాస్టర్‌కు గురువారం సన్మాన కార్యక్రమం మంగళగిరి పట్టణంలోని కుప్పురావు కాలనీలో గల శ్యామలరావు నివాసంలో దంపతులను సత్కరించారు. ఈ సందర్భంగా ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర దేవాంగ సంక్షేమ సంఘం అధ్య క్షులు పూటుకూరి సుబ్రహ్మణ్యేశ్వర స్వామి, ఆలిండియా వీవర్స్ ఫెడరేషన్ జాతీయ అధ్యక్షులు బండారు ఆనంద ప్రసాద్, తిరుపతి శ్రీ శ్రీనివాస రామలింగేశ్వర దేవాంగ నిత్యాన్నదాన సత్రం ప్రధాన కార్యదర్శి సక్కిన చిన్న వెంకటరాయుడు,ఏపీ హైకోర్టు న్యాయవాది కర్రా రవి, రాష్ట్ర దేవాంగ ప్రతినిధులు మెట్ల విఠల్ రావు, అంబక నాగేశ్వరరావులు మాట్లాడుతూ సామాజిక సేవకు గుర్తింపుగా ధ్యాన సాధకులు డాక్టర్ కేకేఎస్ నాగ శ్యామలరావుకు గౌరవ డాక్టరేట్ రావడం ఎంతో హర్షణీయమని అన్నారు. 34 సంవత్సరాలు అధ్యాపకునిగా డాక్టర్ కేకేఎస్ నాగ శ్యామలరావు మాస్టర్ అందించిన సేవలకు గుర్తింపుగా ఈ సంవత్సరం జూలై 27న ఉపాధ్యాయ హిందీ విద్యాపీఠ్ యూనివర్సిటీ మధుర వారు న్యూఢిల్లీలో విద్యా వాచ స్పతి అవా ర్డును అందజేయనున్నట్లు వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో మంగళగిరి అమరా వతి దేవాంగ సంక్షేమ సంఘం ప్రధాన కార్యదర్శి అల్లక తాతారావు, కొండక వెంక టేశ్వరరావు, ఆనెం మల్లేశ్వరరావు, మాన్యం అచ్చియ్య, కటకం చిన సత్య నారా యణ, యర్రా సత్యనారాయణ, కొమ్మన శివ, ఆకాశపు మల్లేశ్వరరావు, పిచ్చిక నాగ నరసింహారావు తదితరులు పాల్గొన్నారు.

మాదిగలకు 7శాతం ఇవ్వాలి

- లేదంటే రాష్ట్ర వ్యాప్త ఆందోళన చేస్తాం

విశాలాంధ్ర - మంగళగిరి : ఎస్సీ వర్గీకరణ రోస్టర్ మొదటి వరసలో మాదిగలకు 7 శాతం ఇవ్వకుంటే రాష్ట్ర వ్యాప్తంగా ఆందో ళనలు చేపడతామని, ఆర్థికంగా అభివృద్ధి చెందిన మాలలకు మొదటి వరసలో 8 శాతం వెనుకబడిన మా దిగలకు 6 శాతం కేటా యించటం ఇదెక్కడి సామాజిక న్యాయమని ఏపీ ఎంఆర్పి ఎస్ రాష్ట్ర అధ్యక్షులు, తెలుగు రాష్ట్రాల సమన్వయకర్త పేరుపోగు వెంకటేశ్వరరావు రాష్ట్ర ప్రభుత్వంపై తీవ్ర స్థాయిలో ధ్వజమెత్తారు. ఆంధ్ర మాదిగ సంఘాల రాష్ట్ర స్థాయి రౌండ్ టేబుల్ సమావేశం మంగళగిరిలోని వేములపల్లి శ్రీకృష్ణ భవన్‌లో గురువారం జరిగింది. ఈ సందర్భంగా పేరుపోగు వెంకటేశ్వరరావు మీడియాతో మాట్లాడుతూ ఉమ్మడి రాష్ట్రంలో ఉద్యోగ నియామకాలలో వర్గీకరణ లేకుండా దొడ్డి దారిన పాత జీవోను అడ్డం పెట్టుకొని 16 వేల ఉద్యోగాలను చంద్రబాబు ప్రభుత్వం విడుదల చేస్తుందని, వర్గీకరణ ఆర్డినెన్స్ ఎందుకు తెచ్చినట్లు అని చంద్రబాబు మాది గలకు సమాధానం చెప్పాలని పేరుపోగు విమర్శించారు. ఎస్సీ వర్గీకరణ విషయంలో సుప్రీంకోర్టు తీర్పుకు భిన్నంగా వ్యవహరించడం చంద్రబాబుకు సరికాదని వెంకటేశ్వ రరావు మాదిగ హెచ్చరించారు. తమిళనాడు తరహాలో మూడు శాతం రిజర్వేషన్లు అదనంగా ఇవ్వాలని, మాదిగలకు 7 శాతం రిజర్వేషన్ ఇచ్చిన చంద్రబాబు నా యుదు విభజిత రాష్ట్రంలో మాదిగలకు 6 శాతం ఇవ్వటం ఇదేనా సామాజిక న్యాయం అని చంద్రబాబును ప్రశ్నించారు. అన్ని రంగాలలో బలపడ్డ మాల కులానికి మొదటి వరుసలో 8 శాతం రిజర్వేషన్ ఇవ్వడాన్ని ఆయన తప్పుపట్టారు. మందకృష్ణ వలనే ఆంధ్ర మాదిగలకు తీవ్ర అన్యాయం జరిగిందని ఆయన విమర్శించారు. ఈ కార్యక్రమంలో అను ముల వంశీకృష్ణ, కవి గాయకులు విజయ్ అంబేద్కర్, అరుం ధతి బంధు సేవ అధ్యక్షులు మట్ట వర సాయి ప్రసాద్, బేడ బుడగ జంగాల సంఘం జాతీయ అధ్యక్షుడు వనం నాగేశ్వర రావు, ఏపీ ఎంఆర్పి ఎస్ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి, పశ్చిమ గోదావరి జిల్లా శెట్టి సృజనారావు, ఏపీ ఎమ్మార్పీఎస్ రాష్ట్ర ఉపాధ్యక్షులు దాచేపల్లి రామాంజనేయులు, ఆసాది గంగిశెట్టి, మందా నాగ మల్లేశ్వరరావు,తప్పెటశివ, ఎర్రంశెట్టి ప్రసాద్, చిట్టూరి బాబు, దాదిపోగు నవీన్ పాల్గొన్నారు.

పర్యావరణ దినోత్సవం

విశాలాంధ్ర- మంగళగిరి : ప్రపంచ పర్యావరణ దినోత్సవ సందర్భంగా నగరపాలక సంస్థ ఆధ్వర్యంలో గురువారం కార్పొరేషన్ కార్యాలయ ఆవర ణలో కార్యక్రమంలో జరిగింది. ఈ సందర్భంగా కార్పొరేషన్ కమిషనర్ అలిం భాష మాట్లాడుతూ కార్పొరేషన్ పరిధిలో 50వేల మొక్కలు నాటేందుకు చర్య లు చేపట్టినట్లుగా తెలిపారు. చెట్లను సంరక్షించుట ద్వారా మనిషి జీవిత కాలాన్ని పెంచుకోవచ్చని అన్నారు. గౌతమ్ బుద్ధ రోడ్‌లో 1200 మొక్కలు నాటామని, ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకొని ఈరోజు నుండి ఏదో ఒక కార్యక్రమం ద్వారా మొక్కలు నాటి 50 వేల మొక్కలు నాటే దిశగా చర్యలు చేపడతామని, ఇందులో భాగంగా గౌతమ బుద్ధ రోడ్డులో 1200 మొక్కలు నాటామన్నారు. ఇందుకు గాను నగర ప్రజలు తమ వంతు సహకారం అందించాలని, ప్రజలందరూ ప్రకృతికి హాని కలిగించే ప్లాస్టిక్‌ను విడనాడాలని, మార్కెట్టుకు..బజారుకు వెళ్ళేటప్పుడు ఇంటి నుంచి కాటన్ సం చులు తీసుకెళ్లడం అలవాటు చేసుకోవాలని ఆయన విజ్ఞప్తి చేశారు. అడిషనల్ కమీషనర్ శకుంతల మాట్లాడుతూ నగర పాలక సంస్థ పరిధిలో ఈ వన మహోత్సవాన్ని పురస్కరించుకొని పెనుమాక, ఇప్పటం కాజ, కొండవనేని టౌన్ షిప్ రోడ్డులలో మొక్కలు నాటే కార్యక్రమాలు చేపట్టామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ గవర్నర్ కార్యదర్శి శ్రీహరి జవహర్ లాల్ , డిప్యూటీ కమీషనర్ డి.శ్రీకాంత్, అసిస్టెంట్ కమీషనర్ పి.శ్రీనివాసరావు, నగరపాలక సిబ్బంది, ఇంజనీరింగ్ సిబ్బంది, సచివాలయ సిబ్బంది, కూటమి నాయకులు గోవాడ దుర్గారావు, రియాజ్, ఎం.వెంకటేశ్వరరావు, పిచ్చయ్య, కొల్లి శేషు తదితరులు పాల్గొన్నారు.

గివింగ్ బ్యాక్ టూ సేవా కార్యక్రమాలు భేష్

విశాలాంధ్ర - మంగళగిరి : సామాజిక సేవలో గివింగ్ బ్యాక్ టు సొసైటీ అందిస్తున్న చేయూత అభినంద నీయమని డాక్టర్ కంటిపూడి సుధాకర్ కొనియాడారు. విజయవాడ ఎనికేపా డుకు చెందిన బడుగు పునీత్ కుమార్ లంగ్ క్యాన్సర్‌తో బాధపడుతున్నాడు. విషయం తెలుసుకున్న గివింగ్ బ్యాక్ టు సొసైటీ ప్రతినిధులు క్యాన్సర్ బాధి తుడు పునీత్ కుమార్‌కు రూ.2 లక్షల ఆర్థిక సాయం అందజేశారు. మంగ ళగిరి మణిపాల్ హాస్పిటల్ హెడ్ డాక్టర్ కంటిపూడి సుధాకర్ చేతుల మీదుగా ఆర్థికసాయాన్ని చెక్కు రూపంలో పునీత్ కుమార్‌కు గురువారం అందజేశారు. ఈ సందర్భంగా డాక్టర్ సుధాకర్ మాట్లాడుతూ గివింగ్ బ్యాక్ టు సొసైటీ చేస్తున్న సేవా కార్యక్రమాలు అభినందనీయమన్నారు. సమాజ శ్రేయస్సుకు సేవా కార్యక్రమాలు చేస్తున్న గివింగ్ బ్యాక్ టు సొసైటీ ప్రతినిధులను మన స్ఫూర్తిగా అభినందిస్తున్నా న్నా రు. సేవ చేయడంతోనే ఆత్మ సంతృప్తి కలుగు తుందన్నారు. గివింగ్ బ్యాక్ టు సొసైటీని స్ఫూర్తిగా తీసుకుని బాధితుడికి మణిపాల్ హాస్పిటల్ తరపున తగిన సహాయం చేస్తామని చెప్పారు. ఆపత్కాలంలో ఆర్థిక సాయమందించి ఆదుకున్న గివింగ్ బ్యాక్ టు సొసైటీ సేవా సంస్థ ప్రతినిధులకు క్యాన్సర్ బాధితుడి కుటుంబ సభ్యులు, బంధువులు ధన్యవాదాలు తెలిపారు.

14 వ వార్డులో సమస్యలను పరిష్కరించాలి

విశాలాంధ్ర - వినుకొండ : స్థానిక 14వ వార్డులో శాఖ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా మున్సిపల్ మాజీ వైస్ ఛైర్మన్ సంద్రపాటి సైదా, నియోజకవర్గ కార్యదర్శి బూదాల శ్రీనివాసరావు, పట్టణ కార్యదర్శి ఉలవలపూడి రాము మాట్లాడుతూ. పట్టణంలో రెండు సెంట్లు నివే సిన స్థలం ఇంటి నిర్మాణానికి 5 లక్షల రూపాయలు కూటమి ప్రభుత్వం మం జూరు చేయాలని, అదేవిధంగా సూపర్ సిక్స్ పథకాలు తల్లికి వందనం ఉచిత బస్సు రైతులకు పెట్టుబడి సాయం 20,000. వికలాంగులకు వితంతువులకు దివ్యాంగులకు వెంటనే నూతన పెన్షన్లు విడుదల చేయాలని, 14వ వార్డులో ప్రజలు ఎదు ర్కొంటున్న సమస్యలను వెంటనే పరిష్కరించి నూతనంగా డ్రైవింగ్ లను సిమెం ట్ రోడ్లను కరెంటు స్తంభాలను కరెంటు లైన్లను మంచినీటి సౌక ర్యం వెంటనే పరిష్కరించాలని వారు డిమాండ్ చేశారు. లేనిచో ఆ ప్రాంత ప్రజలతో కలిసి ఉద్యమం చేసి వారి మౌలిక వసతులను ఏర్పాటుకు భారత కమ్యూనిస్టు పార్టీ వారికి అండగా ఉంటుందని అనేక రాజకీయ అం శాలను వారు ప్రస్తావిం చారు. అనంతరం నూతన కమిటీ ఎన్నుకోన్నారు. నూతన కమిటీని. సిపిఐ సీనియర్ నాయకులు షేక్ కిషోర్ ప్రవేశ పెట్టగా. ఏక గ్రీవంగా చీరాల అంజయ్యను కార్యదర్శిగా, సహాయ కార్యదర్శులుగా బాబు, అంజమ్మను ము క్కంటి జగదీశ్వరి, పదిమందిని శాఖ సభ్యులుగా ఏకగ్రీవంగా ఎన్నుకోన్నారు.

సిబార్‌లో ప్రపంచ పర్యావరణ దినోత్సవం

విశాలాంధ్ర- పెదకాకాని : ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా గురువారం తక్కెళ్లపాడులోని సిబార్ దంత వైద్య కళాశాల తరపున విశేషమైన పర్యావరణ పరిరక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా కళాశాల అధ్యాపకులు, విద్యార్థులు స్వచ్ఛతపైన తమ కర్తవ్యం నెరవేర్చారు. తక్కెళ్లపాడు రహదారి వెంబడి పడవేసిన చెత్త, ప్లాస్టిక్ వ్యర్థాలను తమ శ్రమదానంతో శుభ్రపరిచి, ప్రజలకు శుభ్రత, పర్యావరణ పరిరక్షణపై అవగాహన కల్పించారు. రహదారి పక్కనున్న భారీ చెత్తను తొలగించేందుకు కళాశాల యాజమాన్యం ప్రొక్లైనర్లు, ట్రాక్టర్లను కూడా ఏర్పాటు చేయడం విశేషం. ఈ కార్యక్రమానికి కొనసాగింపుగా గ్రామ పరిసర ప్రాంతాలలో పర్యావరణ సమతుల్యతను పెంపొందించేందుకు 100 మొక్కలు నాటడం జరిగింది. స్థానికులు, విద్యార్థుల సహకారంతో ఈ మొక్కలకు సంరక్షణ బాధ్యతను కూడా ఏర్పాటు చేశారు. తదనంతరం నిర్వహించిన అవగాహన సమావేశంలో కళాశాల డీన్ డాక్టర్ ఎల్.కృష్ణ ప్రసాద్ ప్రసంగిస్తూ ప్లాస్టిక్ వ్యర్థాల వలన పర్యావరణం తీవ్రంగా దెబ్బతింటుందని, వాటి వాడకాన్ని తగ్గించాల్సిన అవసరం ఎంతగానో ఉందని స్పష్టం చేశారు. ప్రపంచవ్యాప్తంగా ప్రతి సంవత్సరం సుమారు 400 మిలియన్ టన్నుల ప్లాస్టిక్ వ్యర్థాలు నీరు, భూమి, ఆహారాన్ని కలుషితం చేస్తున్నాయని వివరించారు. పర్యావరణ పరిరక్షణకు విద్యార్థులు, ఉపాధ్యాయులు, సామాజిక కార్యకర్తలు భాగస్వాములుగా మారాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో డైరెక్టర్ డాక్టర్ కృష్ణమోహన్, నేషనల్ డెంటల్ కౌన్సిల్ సభ్యురాలు డాక్టర్ రేవతి, ప్రిన్సిపాల్ డాక్టర్ బీవీ రమణారెడ్డి, వైస్ డీన్ డాక్టర్ బి.నాగేష్ తదితరులు పాల్గొన్నారు.

విధుల్లో రక్షణ పరికరాలు ధరించాలి: కమిషనర్

విశాలాంధ్ర- గుంటూరు కలెక్టరేట్ : యూజీడీ, సెప్టిక్ ట్యాంక్ కార్మికులు విధుల్లో తగిన రక్షణ పరికరాలు ధరించాలని నగర కమిషనర్ పులి శ్రీనివాసులు సూచించారు. గురువారం నేషనల్ యాక్షన్ ఫర్ మెకనైజ్డ్ శానిటేషన్ ఎకో సిస్టం(నమస్తే)లో భాగంగా గుంటూరు నగరపాలక సంస్థ పరిధిలోని అండర్ గ్రౌండ్ డ్రైనేజి(యూజీడీ), సెప్టిక్ ట్యాంక్‌లను శుభ్రపరిచే కార్మికులకు పని ప్రదేశాల్లో తీసుకోవాల్సిన రక్షణ చర్యలపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ యూజీడీ, సెప్టిక్ ట్యాంక్ క్లీనింగ్ కార్మికులు నిత్యం ప్రమాదకర ప్రాంతాల్లో పారిశుధ్య పనులు నిర్వహిస్తూ ప్రజారోగ్యానికి రక్షణగా నిలుస్తున్నారన్నారు. కార్మికులు ఆరోగ్య భద్రతకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రత్యేక శ్రద్ధ చూపుతున్నాయన్నారు. నమస్తే పథకం ద్వారా గుంటూరు నగరపాలక సంస్థ పరిధిలో యూజీడీ కార్మికులకు పీపీఈ కిట్లు అందించామని, ఇంకా ఎవరికైనా కావాలి అంటే వివరాలతో జీఎంసీ ప్రజారోగ్య విభాగంలో సంప్రదించాలన్నారు. కిట్‌లో ఫుల్ బాడీ సూట్, గమ్ బూట్లు, చేతి గ్లౌజులు, నైట్రిల్ మాస్క్, ఎన్-95 మాస్క్, సేఫ్టీ కళ్ళద్దాలు, హెల్మెట్‌లు ఉంటాయని, కార్మికులు విధుల్లో తప్పనిసరిగా రక్షణ పరికరాలు ధరించడం ద్వారా ప్రమాదాల నుంచి రక్షణ పొందవచ్చని తెలిపారు. కార్యక్రమంలో ఈఈ సుందర్రామిరెడ్డి, స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ నుంచి అనిల్, వినయ్, జీఎంసీ సాలిడ్ వేస్ట్ మేనేజ్‌మెంట్ స్పెషలిస్ట్ అనిల్ కుమార్ పాల్గొన్నారు.

కూటమి పాలనలో సహకార బ్యాంకులకు స్వర్ణయుగం

- డీసీసీబీ ఛైర్మన్ మక్కెన ప్రమాణ స్వీకారంలో అచ్చెన్నాయుడు, జీవీ

విశాలాంధ్ర - వినుకొండ : సహకార బ్యాంకులకు స్వర్ణయుగంగా కూటమి పాలన సాగుతోందని మంత్రి అచ్చెన్నాయుడు, ప్రభుత్వ చీఫ్ విప్ జీవీ ఆంజనేయులు పేర్కొన్నారు. రైతులకు, ప్రభుత్వానికి వారధిగా సహకార బ్యాంకు వ్యవస్థ ఉందని, అన్నదాతలకు వ్యవసాయ పెట్టుబడి ఖర్చులకు రుణసాయం అందించడంలో సహకార బ్యాంకులదే కీలకపాత్ర అని తెలిపారు. గుంటూరు బ్రాడీపేటలోని డీసీసీబీ కార్యాలయంలో గురువారం ఛైర్మన్‌గా మక్కెన మల్లికార్జునరావు ప్రమాణస్వీకారం చేశారు. శుభ ముహూర్తాన డీసీసీబీ ఛాంబర్‌లో సంతకం చేసి బాధ్యతలు స్వీకరించారు. ఈ కార్యక్రమానికి మంత్రి అచ్చెన్నాయుడు, చీఫ్ విప్ జీవీ ఆంజనేయులు, ఎమ్మెల్యేలు నక్కా ఆనందబాబు, భాష్యం ప్రవీణ్, తదితరులు హాజరయ్యారు. మక్కెనకు పుష్పగుచ్ఛాలు అందించి అచ్చెన్నాయుడు, జీవీ ఆంజ నేయులు అభినందనలు తెలిపారు. డీసీఎంఎస్ ఛైర్మన్‌గా బాధ్యతలు చేపట్టిన వడ్రాణం హరిబా బుకు చీఫ్ విప్ జీవీ ఆంజనేయులు అభినందనలు తెలిపారు. అనంతరం డీసీసీబీ కార్యాలయం ఆవరణలో ఏర్పాటు చేసిన సభలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా చీఫ్ విప్ జీవీ ఆంజనేయులు మాట్లాడుతూ. మక్కెన మల్లికార్జునరావు డీసీసీబీ ఛైర్మన్ కావడం చాలా ఆనందంగా ఉందన్నారు. లక్షలాది మంది రైతులకు మక్కెన అత్యుత్తమ సేవలు అందించగలరని, ఆయనకు ఆ సమర్థత, నైపుణ్యం ఉందని, డీసీసీబీ ఛైర్మన్ పదవికి వన్నె తెస్తారని పేర్కొన్నారు. గత వైసీపీ ప్రభుత్వంలో లాగా లూటీలు, దోపిడీలు లేకుం డా అడ్డుకట్ట వేస్తారని ఆశాభావం వ్యక్తం చేశా రు. ఉమ్మడి గుంటూరు జిల్లా సహకార కేంద్ర బ్యాంకును దేశంలోనే అత్యుత్తమ సహకార బ్యాంకుగా నిలిపేలా పనిచేస్తారని, అధికారులు, ఉద్యోగుల సహకారంతో బ్యాంకును లాభాల బాటలో నడిపిస్తారని ఆకాంక్షిస్తున్నట్లు చెప్పారు. డీసీసీబీ బ్యాంకు ఘనమైన విజయాలు సాధించడానికి ఉమ్మడి జిల్లా ఎమ్మెల్యేలమంతా అండగా ఉండి పూర్తి సహాయ సహకారాలు అందిస్తామని జీవీ ఆంజనేయులు తెలిపారు. అనంతరం మంత్రి అచ్చెన్నాయుడు మాట్లాడుతూ రైతులకు మేలు చేయాలనే ఉద్దేశంతో దివంగత నందమూరి తారక రామారావు సహకార వ్యవస్థను తీసుకొచ్చారని, అందుకు అనుగుణంగా రాష్ట్రంలోని రైతులకు మేలు చేయాలన్నారు. కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత గుంటూరు, కృష్ణా డీసీసీబీల్లో ఎక్కడెక్కడ అవినీతి జరిగింది, వారందరిపై విచారణ కూడా చేయిస్తున్నామని తెలిపారు. గుంటూరు, కృష్ణా జిల్లాలోనే కాకుండా రాష్ట్రంలో అన్నిచోట్ల ఎన్నికలు జరపకుండా త్రిసభ్య కమిటీని నియమించుకుని కనీసం ఎక్కడా ఆడిట్ లేకుండా విపరీతంగా దోపిడీ జరిగిందని శాసనసభలో ఎమ్మెల్యేలంతా ఆందోళన చెందిన సందర్భంలో ప్రభుత్వ సహకారంతో శాసనసభాపతి హౌస్ కమిటీని నియమించారన్నారు. ఇప్పటికే ఆ కమిటీ విచారణ జరిపి నివేదిక కూడా సమర్పించిందని ఈ సందర్భంగా తెలిపారు. కూటమి ప్రభుత్వం వచ్చిన ఏడాదిలోనే సహకార వ్యవస్థలో అనేక మార్పులు తీసుకొచ్చామని, వైసీపీ పాలనలో ఈ వ్యవస్థలో ఎక్కడా కూడా పారదర్శకత లేదని, ఎంతమంది వ్యతిరేకించినా కేంద్ర ప్రభుత్వ సహకారంతో అన్ని ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాలు, జిల్లా సహకార కేంద్ర బ్యాంకులను కంప్యూటరైజ్ చేయడం జరిగిందన్నారు. అవినీతికి తావులేకుండా ఈ వ్యవస్థను నడపటానికి అవకాశాలు ఉన్నాయన్నారు. వ్యవసాయం చేసే ప్రతి కౌలు రైతుకు తప్పనిసరిగా రుణాలిచ్చి వారికి సహకరించడానికి బ్యాంకుల ద్వారా అన్నివిధాల చర్యలు తీసుకుంటామని తెలిపారు.

గాజు గ్లాసుల పంపిణీ

విశాలాంధ్ర- తుళ్లూరు : ప్లాస్టిక్ వినియోగం వద్దంటూ మేరీమాత ఇంగ్లీష్ మీడియం ఉపాధ్యాయులు, జనసేన నాయకులు గల్లా శంకరరావు గురువారం గాజు గ్లాసులను పంపిణీ చేశారు. ప్లాస్టిక్ గ్లాసులు వద్దు.. గాజు గ్లాసులు వాడి క్యాన్సర్ ముప్పును తప్పిద్దామంటూ తుళ్లూరులోని టీ దుకాణ యజమానులకు గాజు గ్లాసులు అందజేశారు. ప్లాస్టిక్ రహిత సమాజ స్థాపనకు జరిగే కృషిలో తాను కూడా భాగస్వామ్యం కావాలన్న ఉద్దేశ్యంతో గాజు గ్లాసులను ఉచితంగా పంపిణీ చేయడం జరిగిందని శంకరరావు చెప్పారు.

ఆర్టీసీ డిపోలో పర్యావరణ దినోత్సవం

విశాలాంధ్ర - పొన్నూరు : ప్రపంచ పర్యావరణ దినోత్సవ సందర్భంగా గురువారం గుంటూరు జిల్లా ఏపీ ఎస్ఆర్టీసీ పొన్నూరు డిపోలో డిపో మేనేజర్ అజిత కుమారి సమక్షంలో డిపో గ్యారేజీ ఆవరణంలో మొక్కలు నాటే కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా డిపో మేనేజర్ అజిత కుమారి మాట్లాడుతూ పర్యావరణకు చెట్లు ఎంతో మేలు చేస్తాయని, డిపో ఆవరణలోని ఖాళీగా ప్రాంతంలో అందరూ బాధ్యతగా మొక్కలు నాటి పర్యావరణమును, వాతావరణ సమతుల్యతను కాపాడాలని తెలియజేశారు. కార్యక్రమంలో డిపో సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

జేడీసీఎంఎస్ ఛైర్మన్‌గా వడ్రాణం హరిబాబు ప్రమాణ స్వీకారం

విశాలాంధ్ర - గుంటూరు వైద్యం : స్థానిక కన్నవారితోట సమీపంలో ఉన్న జేడీసీఎంఎస్ కార్యాలయంలో ఉమ్మడి గుంటూరు జిల్లా కో-ఆపరేటివ్ మార్కెటింగ్ సొసైటీ (జేడీసీఎంఎస్)ఛైర్మన్‌గా వడ్రాణం హరిబాబు గురువారం ప్రమాణ స్వీకారం చేశారు. ఈ సందర్భంగా గుంటూరు పశ్చిమ ఎమ్మెల్యే గళ్ళా మాధవి, అఖిల భారత పంచాయతీ పరిషత్ (న్యూఢిల్లీ) జాతీయ ఉపాధ్యక్షులు, అమరావతి అభివృద్ధి కమిటీ ఛైర్మన్ డాక్టర్ జాస్తి వీరాంజనేయులు, ఉమ్మడి గుంటూరు జిల్లా జనసేన పార్టీ సీనియర్ నాయకులు మిరియాల గోపి కుమార్, మిరియాల ప్రసాదరావు, టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులు పాల్గొని పూలబొకే, శాలువాలు కప్పి శుభాకాంక్షలు తెలియజేశారు. అనంతరం జేడీసీఎంఎస్ ఛైర్మన్‌గా ప్రమాణ స్వీకారం చేసిన వడ్రాణం హరిబాబు మాట్లాడుతూ నాపై అపారమైన నమ్మకం ఉంచి ఒక బాధ్యత కలిగిన జేడీసీఎంఎస్ ఛైర్మన్ పదవిని కట్టబెట్టిన సీఎం చంద్రబాబుకు, మంత్రి నారా లోకేష్‌కు, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్‌కు, గుంటూరు ఎంపీ డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్‌కు, గుంటూరు జిల్లా ఎమ్మెల్యేలకు ధన్యవాదాలు తెలియజేస్తున్నట్లు తెలిపారు. రైతులకు సేవ చేసే అవకాశం తనకు రావటం చాలా సంతోషంగా ఉందన్నారు. రైతులకు ఎరువులు, విత్తనాలు సరసమైన ధరలకు ఇవ్వటం అనేది దీని లక్ష్యమన్నారు. రాష్ట్రంలోనే ఇది లాభసాటిగా కొనసాగుతుందని, అటువంటి ఈ సంస్థను మరింత బలోపేతం చేయడానికి కృషి చేస్తానని పేర్కొన్నారు. వరి పంట పండించిన రైతు నేడు ధరలు లేక ఎన్నో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, ఈ నేపథ్యంలో సీఎం చంద్రబాబు, వ్యవసాయ శాఖ మంత్రి అచ్చెన్నాయుడుల దృష్టికి తీసుకెళ్ళి మంచి మద్దతు ధర కల్పించే విధంగా కృషి చేస్తానని తెలిపారు. వాణిజ్య పంటలకు కూడా గిట్టుబాటు ధరలు ఉండే విధంగా కృషి చేస్తానని, ఈ సంస్థ రైతులకు వెన్నుదన్నుగా ఉంటుందన్నారు.

LOSS OF PASSPORT

I, ATHMAKURI DILIP KUMAR (Cell: 7989169542) S/O. Athmakuri Subba Rao, R/o. D.No.19-15-425, Backside Sivalayam, IPD Colony 6th Line, Sangadigunta, Guntur, Guntur District, Andhra Pradesh. I lost my original **Passport No.U8921318** on 25-05-2025 while traveling from my house to Xerox Centre, IPD Colony, Guntur. If anybody finds it, please inform me.

బహిరంగ ప్రకటన

నా క్లయింటు అయిన గుంటూరు సిటీ, దేవాపురం 5వలైను,డి.బి.హోమ్స్, ఫ్లాటు నెం.102 కాపురస్తులు అయిన గుంటుపల్లి జ్వాన్సిస్‌ట@చార్లి గారి సూచనల మేరకు యావన్మందికీ తెలియజేయునదేమనగా, నా క్లయింటు ది.19-03-1990న తనకుమార్తె గుంటుపల్లి శౌరీలు మైనరుగా ఉండగా కొనుగోలు చేసిన విక్రయ దస్తావేజు నెం:2071/1990రుగా యస్.ఆర్.ఒ.గుంటూరు తాలుకు ఆస్తి, గుంటూరు డి॥&నబ్.డి, జి.యం.సి ఎరియాలో చేరిన గుంటూరు గ్రామ డి.నెం.1156 & 1157 తాలుకు భూమిలో ప్లాంటు నెం.18 చ.గ.266లు ఖాళీ నివేశన స్థలముకు చెందిన పై తెలిపిన ఒరిజినల్ దస్తావేజు మరికొన్ని డాక్యుమెంట్లును తీసుకోని ది:02-06-2025న గుంటూరు రిజిస్ట్రారు ఆఫీసు వద్దకు పని నిమిత్తం వచ్చి అక్కడ ఉన్న జిరాక్స్ షాపు నందు జిరాక్స్ తీయించుకోని తిరిగి ఇంటికి వెళ్ళు నప్పుడు చూచుకోనగా పై తెలిపిన తన కుమార్తె గుంటుపల్లి శౌరీలు పేరున గల ఒరిజినల్ దస్తావేజు కనిపించలేదు. ఆ చుట్టు పక్కల మరియు జిరాక్స్ షాపు నందు ఎంత వెతికిన దొరకలేదు. కావున సదరు దస్తావేజు ఎవరికైనా దొరికినయడల ఈ క్రింది అడ్రస్ నందు అందజేసిన వారికి తగిన బహుమతి ఇవ్వబడును.అట్లు కాక సదరు దస్తావేజును ఉపయోగించి ఎవరైనా ఏవిధమైన అన్యా క్రాంతములు జరిపిన నా క్లయింటు తీసుకొను చట్టపరమైన సివిల్ & క్రిమినల్ చర్యలకు బాధ్యులు కాగలరని తెలియ జేయటమైనది.

కె.ఎ. విల్సన్, అడ్వకేట్,
3/10 బ్రాడీపేట, గుంటూరు. సెల్: 9440752001

మొక్కల పెంపకాన్ని ఉద్యమంలా చేపట్టాలి : చీఫ్ విప్ జీవీ

విశాలాంధ్ర - వినుకొండ : ప్రతిఒక్కరూ తప్పనిసరిగా విధిగా మొక్కలు నాటాలని, నాటిన వాటిని బ్రతికించుకోవాలని ప్రభుత్వ చీఫ్ విప్, ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులు పిలుపునిచ్చారు. పచ్చని చెట్లు ప్రగతికి మెట్లు అనే విషయాన్ని గుర్తించాలని, కాలుష్యం బారి నుంచి తప్పించుకోవడానికి మొక్కల పెంపకమే ఏకైక మార్గమని సూచించారు. ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన వనమహోత్సవం కార్యక్రమాన్ని వినుకొండలో ఆయన ప్రారంభించారు. స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల మైదానంలో పురపాలక సంఘం ఆధ్వర్యంలో మొక్కలు నాటారు. అనంతరం చీఫ్ విప్ జీవీ ఆంజనేయులు మాట్లాడుతూ గత వైసీపీ ప్రభుత్వానికి పచ్చదనం పెంపు, పర్యావరణ పరిరక్షణ వంటివి ఏమీ పట్టలేదని విమర్శించారు. కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత ఆ పరిస్థితిని మారుస్తున్నామని, సీఎం చంద్రబాబు మొదటి నుంచి కూడా హరితాంధ్రప్రదేశ్ కోసం ప్రయత్నిస్తున్నారని గుర్తుచేశారు, అందులో భాగంగానే ఇప్పుడు వన మహోత్సవం చేపట్టామన్నారు. వైకాపా పాలనలో ఎక్కడికక్కడ పచ్చని చెట్లను నరికేశారని, అటవీశాఖ సామాజిక వన నర్సరీలనూ పట్టించుకోలేదని పేర్కొన్నారు. వాతావరణ కాలుష్యాన్ని తగ్గించుకోవా లంటే ఆక్సిజన్, నీడనిచ్చే ప్రకృతి బిడ్డలను పెంచాల్సిన అవ శ్యకత ఎంతో ఉం దన్నారు. పర్యావరణ సమ తుల్యత కాపాడేలా మొక్కలు నాటి సంరక్షిం చడాన్ని ప్రతి పౌరుడు బాధ్యతగా తీసు కోవాలని పిలుపునిచ్చారు. పాలిథిన్ కవర్లకు ప్రత్యామ్నాయంగా వస్త్ర, జనప నారసంచులు వినియోగించాలని సూచించారు. ప్లాస్టిక్ సంచుల వాడకాన్ని ప్రతి పౌరుడు నియంత్రించాలని, వాటిని తయారు చేయ డం కూడా పెద్ద నేరమని చెప్పారు. పర్యావరణానికి నష్టం చేకూర్చే పాలిథిన్ సంచులు, ప్లాస్టిక్ డబ్బాలను వాడొద్దని ప్రజ లందరికీ విజ్ఞప్తి చేస్తున్నామన్నారు. ఈ కార్యక్రమం లో కమిషనర్ సుభాష్ చంద్రబోస్, జనసేన నాయకులు నాగ శీను రాయల్, నాయకులు పాల్గొన్నారు.

ఆవులను వధిస్తే చర్యలు తప్పవు

విశాలాంధ్ర - వినుకొండ : బక్రీద్ పండుగను పురస్కరించుకొని పురపాలక సంఘ పరిధిలో ఎక్కడ ఆవులను, దూడలను వధించరాదని మునిసిపల్ కమిషనర్ యమ్. సుభాష్ చంద్రబోస్ తెలిపారు. గురు వారం పురపాలక సంఘ కార్యాలయ కమిషనర్ ఛాంబర్‌లో సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ. వ్యవసాయానికి పనికిరాని జంతువులను మాత్రమే వెటర్నరీ వైద్యుల ధ్రువీకరణ పత్రం పొంది అధికారులు తెలిపిన ప్రాంతాలలో మాత్రమే వధించుకోవాలని, ఎక్కడపడితే అక్కడ రోడ్లపై వధించకూడదని, అధికారుల నిబంధనలను ఉల్లంఘిస్తే వారి పైన చట్టపరమైన చర్యలు తీసుకోంటామని అన్నారు. మసీదుల దగ్గర ఎటువంటి అవాంఛనీలు జరగకుండా బందోబస్తు ఏర్పాటు చేస్తామని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో శానిటరీ ఇన్స్పెక్టర్ షేక్ ఇస్మాయిల్, మున్సిపల్ సిబ్బంది ముస్లిం మత పెద్దలు పాల్గొన్నారు.

లెదర్ పార్కు ఏర్పాటుకు థాయ్‌లాండ్ కంపెనీ స్థల పరిశీలన

విశాలాంధ్ర - వినుకొండ : ప్రైమ్ ఏసియా, థాయ్‌లాండ్‌కు చెందిన ఒక ప్రముఖ కంపెనీ, వినుకొండ మండలం వెంకుపాలెం గ్రామంలో లెదర్ పార్కు ఏర్పాటుకు కంపెనీ ప్రతినిధులు గ్రామంలోని సర్వే నంబర్ 1లో ఉన్న భూమిని సందర్శించి పరిశీలించారు. ఈ స్థల పరిశీలన కార్యక్రమంలో ప్రైమ్ ఏసియా కంపెనీ ప్రతినిధులతో పాటు వినుకొండ తహసీల్దార్ సురేష్ నాయక్, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

వినుకొండ ఆర్టీసీ గ్యారేజీ ఆవరణలో ప్లాంటేషన్

విశాలాంధ్ర - వినుకొండ : ప్రపంచ పర్యావరణ పరిరక్షణ దినోత్సవంలో భాగంగా గురువారం స్థానిక ఆర్టిసి డిపో గ్యారేజ్ ఆవరణలో వివిధ రకాల మొక్కలను నాటారు. డిపో మేనేజర్ జె. నాగేశ్వరరావు ఆధ్వర్యంలో కార్యాలయ సిబ్బంది గ్యారేజీ, రన్నింగ్ స్టాఫ్, అధికారులు కలిసి మొక్కలు ప్లాంటేషన్ చేశారు. ఈ కార్యక్రమంలో ఆఫీస్ సూపరింటెంట్ మోహన్ రావు, ఎంప్లాయిస్ యూనియన్ నాయకులు పి. సాంబశివరావు, ఎన్ఎంయు నాయకులు శివ నాయక్, కార్మిక పరిషత్ నాయకులు పేరయ్య, ఎస్టిబ లు, గ్యారేజ్ సిబ్బంది పాల్గొన్నారు.

ఘనంగా దేవాలయ సింహద్వారం ప్రారంభోత్సవం

విశాలాంధ్ర - పొన్నూరు : పట్టణంలోని 3వ వార్డు మహాప్రస్థానం వద్ద శ్రీ కామేశ్వరి సహిత ముక్తి నాదేశ్వర స్వామి దేవస్థానంలో నూతన దేవాలయ సింహద్వారం ప్రారంభోత్సవం జరిగింది. కార్యక్రమానికి ముఖ్యఅతిథి గా పొన్నూరు నియోజకవర్గ ఎమ్మెల్యే, సంగం డెయిరీ ఛైర్మన్ ధూళిపాళ్ల నరేంద్రకుమార్ పాల్గొన్నారు.

10తేదీ వరకు మలబార్‌లో 'మైన్' డైమండ్ ప్రదర్శన

విశాలాంధ్ర-గుంటూరు వైద్యం : స్థానిక లక్ష్మీపురం హాలివుడ్, బాలివుడ్ థియేటర్ల సమీపంలో ఉన్న మలబార్ గోల్డ్ అండ్ డైమండ్ షోరూంలో ఈ నెల 10వ తేదీ వరకు నిర్వహిం చబడే 'మైన్' డైమండ్స్ షో (ప్రత్యేక వజ్రాభరణాల ప్రదర్శన)ను ప్రముఖ డాక్టర్లు పాలకుర్తి శ్రీస్నేహ, రోహిత ముఖ్య అతిథులుగా హాజరై ఘనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా షోరూం నందు అందుబాటులో ఉన్న మైన్ డైమండ్స్‌ను షోరూంలో కలియ తిరిగి తిలకించారు. అనంతరం డాక్టర్ శ్రీస్నేహ, డాక్టర్ రోహితలు మీడియాతో మాట్లడుతూ మైన్ డైమండ్స్ ప్రదర్శన ప్రారంభోత్సవానికి తాము రావడం చాలా సంతోషంగా ఉందన్నారు. నాణ్య తకు.. మన్నికకు మారుపేరు మలబార్ గోల్డ్ అండ్ డైమండ్స్ అని అన్నారు. గుంటూరు ప్రజలు, ఆ పరిసర ప్రాంత ప్రజలు ఒకసారి గుంటూరులో ఉన్న మలబార్ గోల్డ్ అండ్ డైమండ్స్ షోరూంను సందర్శించి లేటెస్ట్‌గా అందుబాటు లో ఉంచిన అనేక రకాల మైన్ డైమండ్స్‌ను కొనుగోలు చేయాలని కోరారు. స్టోర్ హెడ్‌నదీర్, జతిన్, మార్కెటింగ్ మేనేజర్ గోపీ కిరణ్ మాట్లాడుతూ వజ్రాభరణాలకు బ్రాండ్ అంబాసిడర్ మలబార్ గోల్డ్ అండ్ డైమండ్స్ అని అన్నారు. కస్టమర్ల శ్రేయస్సే పరమావధిగా నాణ్యమైన ఆభరణాలను అందరికీ అందుబాటులో తక్కువ ధరకే విక్రయిస్తున్నామని, అన్ని శుభకార్యాలకు సంబంధించిన ఆభరణాలు మలబార్‌లోనే ఉంటాయని పేర్కొన్నారు. ఈ కార్యక్రమం లో కస్టమర్ పెద్ది రమణరావు, సిబ్బంది పాల్గొన్నారు.

వేలం ప్రకటన

మహారాజశ్రీ సివిల్ జడ్జి (సీనియర్ డివిజన్) గురజాల వారి కోర్టులో

ఇ.పి.నెం.78/2019 ఇన్ ఒ.ఎస్.నెం.137/18

ముంగి పెద్దలచ్చయ్య @ లక్ష్మయ్య - పిటిషనర్/డి.హెచ్.ఆర్. వర్సెస్

పాశం రామకృష్ణ - రెస్పాండెంట్ /జె.డి.ఆర్.

పై నెంబర్‌లో డి.హెచ్.ఆర్ తన డిక్రి బాకీ రాబట్టు నిమిత్తం అమలు చర్యలు చేపట్టి ఉండగా శ్రీ కోర్టువారు జె.డి.ఆర్‌కి చెందిన షెడ్యూలు ఆస్తిని వేలం జరిపించుటకు ఆదేశించినారు.

షెడ్యూలు: పల్నాడు జిల్లా నరసరావుపేట, రిజిస్ట్రేషన్ జిల్లా, పిడుగురాళ్ల ఎస్.ఆర్.ఓ ఇలాకా, మాచవరం మండలం, ఆకురాజుపల్లి, రెవెన్యూ సివారు, సర్వే నెం: 253-1లో ఎకరం 1-00 మెట్ట భూమికి హద్దులు: తూర్పు: దారి, దక్షిణం: వసంత శ్రీను, పడమర: పాశం సాంబయ్య, ఉత్తరం: మేడగం కృష్ణారెడ్డి,

(E.C. దాఖలా జె.డి.ఆర్ చేసిన అన్యాక్రాంతము ఏమిన్ని లేవు)

డి.హెచ్.ఆర్ విలువ రు.6,00,000/-లు

అమీనా విలువ రు.10,00,000/-లు

వేలం తేదీ : 19-6-2025

ఫరదర్ హియరింగ్ : 26-6-2025

యలిరాజు వెంకటేశ్వర్లు, ఎం. లక్ష్మీ నాగారపమ్మ

న్యాయవాదులు

గురజాల, సెల్ నెం : 7981373694.

దుక్కులు దున్నుతున్న రైతులు

విశాలాంధ్ర- తాడికొండ : ఈ ఏడాది ఖరీఫ్ సీజన్ ప్రారంభం కానుంది. ఇప్పటికే అరకొర వర్షాలు పడ్డాయి. పంట పొలాలు పదునెక్కాయి. రైతులు డాక్టర్ల ద్వారా భూములను దున్నుతున్నారు. గొర్రు, గుంటక, బ్లేడు వేసినందుకు ఎకరాకు రూ.700లు రెండు నాగళ్ళు, రోటవేటర్ వేసినందుకు రూ. 2000లు రైతులు చెల్లిస్తున్నారు. పంట పొలాలను సాగు లోకి తీసుకువస్తు న్నారు. రైతులు దుక్కులు దున్ను తున్నారు.

అనుమతి లేని నిర్మాణాలపై చర్యలు తథ్యం

విశాలాంధ్ర - పొన్నూరు : పొన్నూరు పురపాలక సంఘ పరిధిలో జీబీసీ రోడ్డు తోటమ్మ తల్లి దేవాలయం ఎదురు ఓ షాపింగ్ కాంప్లెక్స్ ముందు అనుమతి లేని నిర్మాణాలు చేపట్టి పైపు లైను ధ్వంసం చేసిన వారిపై చర్యలు తీసుకుంటామని మున్సిపల్ కమిషనర్ ముప్పాళ్ళ రమేష్ బాబు పేర్కొన్నారు. గురువారం వాటర్ పైపులైను పగిలిన ప్రదేశాన్ని ఆయన శానిటరీ ఇన్స్పెక్టర్ శ్రీనివాస్‌తో కలిసి పరిశీలించారు. సంబంధిత వ్యక్తులకు నోటీసులు జారీ చేస్తామని తెలిపారు.

యువకుడు దారుణ హత్య

విశాలాంధ్ర - పొన్నూరు : పొన్నూరు పట్టణం అంబేద్కర్ సెంటర్ శ్రీ విజయ గణేష్ లాడ్జి వద్ద గురువారం తెల్లవారుజామున యువకుడు దారుణ హత్యకు గురయ్యాడు. స్థానికుల కథనం ప్రకారం బుధవారం రాత్రి యువకులు వాదులాడుకుంటున్నట్లు తెలిపారు. మృతుడు పొన్నూరు మండలం ఆలూరు గ్రామానికి చెందిన షేక్ సైదా(25)గా గుర్తించారు. పట్టణ పోలీసులకు స్థానికులు సమాచారం అందించారు.

అరాచక పాలన నుంచి విముక్తికి ఏడాది

విశాలాంధ్ర - వినుకొండ : కూటమి ప్రభుత్వం వచ్చి ఏడాది పూర్తయిన సందర్భంగా జనసేన పార్టీ రాష్ట్ర అధ్యకుడు పవన్ కల్యాణ్ ఆదేశాల మేరకు, వినుకొండ జనసేన పార్టీ నాయకులు కొణిజేటి నాగశ్రీను రాయల్ ఆధ్వర్యంలో బుధవారం రాత్రి టీడీపీ, బీజేపీ పార్టీకు చెందిన నాయకులతో కలిసి శివయ్య స్థూపం సెంటర్లో పీడ విరగడై ఏడాది పేరుతో సంబరాలు జరుపుకున్నారు. భారత ప్రధాని నరేంద్ర మోదీ, రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్, ప్రభుత్వ చీఫ్ విప్ జీవీ ఆంజనేయులు చిత్రపటాలకు పాలాభిషేకం చేసి మిఠాయిలు పంచారు. కార్యక్రమంలో నాగశ్రీనురాయల్, టిడిపి రాష్ట్ర కార్యదర్శి షమీమ్, ఆయూబ్ ఖాన్, మేడం రమేష్, పివి సురేష్, కౌన్సిలర్లు షకీలా బేగం పాటు కూటమి కార్యకర్తలు పాల్గొన్నారు.

In the Court of the A.P. Co-Operative Tribunal Court At Vijayawada

O.P.No. 39/2022, MP No. 13/2025

Between:

The Kakateeya Mutually Aided Threift and Credit Co-Operative Society Ltd. Rep. by It's General Manager Kothapeta, Tenali -- Petitioner

And

Ancha Srinivasa Rao -- Respondent

Address :

Ancha Srinivasa Rao

S/o. A. Venkata Sambasiva Rao

Flat No.402, SRK Land Mark, Golidonka, Ithanagar) Tenali.

పై నెంబరు Suit లో మీరు Respondent 1 అయిన మీకు శ్రీ కోర్టు వారు ఎన్ని పర్యాయములు కోర్టు సమన్లు (Notice) పంపినను తీసుకొనక కాలయాపన చేయుచున్నందున ఈ ప్రకటన ద్వారా మీ హాజరు నిమిత్తం ది.30-06-2025వ తేదీన వాయిదా వేసియున్నారు. కావున ఆ రోజు ఉదయం గం.10.30 ని॥లకు పై కోర్టు వారి ఎదుట మీరు స్వయముగా గానీ, న్యాయవాది ద్వారా గానీ, హాజరై ఆక్షేపణలు ఉన్నచో తెలుపుకోవలెను.

వాయిదా తేదీ: 30-06-2025

(శ్రీ కోర్టు వారి అనుమతితో)

ఇట్లు

సి.హెచ్. శ్రీదేవి, అడ్వకేట్

డో.నెం. 52-4-6, అరుణ టవర్స్, ఫ్లాట్ నెం: 306, పాత పంచాయితీ ఆఫీస్, గుణదల, విజయవాడ.

In the Court of the A.P. Co-Operative Tribunal Court At Vijayawada

O.P.No. 22/2022, MP No. 11/2025

Between:

The Kakateeya Mutually Aided Threift and Credit Co-Operative Society Ltd. Rep. by It's General Manager Kothapeta, Tenali -- Petitioner

And

Nemalikanti Suresh Babu Alias Suresh -- Respondent

Address :

Nemalikanti Suresh Babu

S/o. Subba Rao

D.No. 8-117, Near Gandhi Statue, Chiluvuru (Post), Duggirala Mdl, Guntur Dist.

పై నెంబరు Suit లో మీరు Respondent 1 అయిన మీకు శ్రీ కోర్టు వారు ఎన్ని పర్యాయములు కోర్టు సమన్లు (Notice) పంపినను తీసుకొనక కాలయాపన చేయుచున్నందున ఈ ప్రకటన ద్వారా మీ హాజరు నిమిత్తం ది.30-06-2025వ తేదీన వాయిదా వేసియున్నారు. కావున ఆ రోజు ఉదయం గం.10.30 ని॥లకు పై కోర్టు వారి ఎదుట మీరు స్వయముగా గానీ, న్యాయవాది ద్వారా గానీ, హాజరై ఆక్షేపణలు ఉన్నచో తెలుపుకోవలెను.

వాయిదా తేదీ: 30-06-2025

(శ్రీ కోర్టు వారి అనుమతితో)

ఇట్లు

సి.హెచ్. శ్రీదేవి, అడ్వకేట్

డో.నెం. 52-4-6, అరుణ టవర్స్, ఫ్లాట్ నెం: 306, పాత పంచాయితీ ఆఫీస్, గుణదల, విజయవాడ.

విశాలాంధ్ర

శుక్రవారం 06 జూన్, 2025

నరేంద్ర మోదీ నియంతృత్వ ధోరణిని విడనాడాలి

సీపీఐ నియోజకవర్గ కార్యదర్శి చిన్ని తిరుపతయ్య

విశాలాంధ్ర - దుగ్గిరాల : కేంద్రంలో నరేంద్ర మోడీ ప్రభుత్వం నియంతృత్వ ధోరణిని తో వ్యవహరిస్తూ ప్రజా, రైతు, కార్మిక, వ్యతిరేక విధానాలను అవలంబిస్తుందని సిపిఐ నియోజకవర్గ కార్యదర్శి చిన్ని తిరుపతయ్య విమర్శించారు. బుధవారం రాత్రి దుగ్గిరాల మండలంలోని మంచికలపూడి గ్రామంలో సిపిఐ గ్రామ శాఖ సమావేశం జరిగింది. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరైన చిన్ని తిరుపతయ్య తన ప్రసంగాన్ని కొనసాగిస్తూ కేంద్రంలో నరేంద్ర మోడీ గత 11 సంవత్సరాలుగా అధికారంలో ఉండి దేశ ఆర్థిక వ్యవస్థను చిన్నాభిన్నం చేశారని ఆయన ఆరోపించారు. దేశంలో అతిపెద్ద రంగమైన వ్యవసాయ రంగాన్ని నిర్వీర్యం చేయటానికి చూస్తున్నారని ఆయన అన్నారు. గత ఎన్నికల ముందు రైతులు ధర్నా చేస్తుంటే వారి వద్దకు వెళ్లి రైతాంగం సమస్యలు పరిష్కరిస్తానని, రైతులకు క్షమాపణ చెప్పిన నరేంద్ర మోడీ తీరా అధికారం చేపట్టిన తర్వాత రైతుల నడ్డి విరిచే విధంగా నల్ల చట్టాలను తీసుకువస్తున్నారని ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. యువతకు ఉద్యోగ అవకాశాలు కల్పించడంలో నరేంద్ర మోడీ పూర్తిగా వైఫల్యం చెందారని ఆయన విమర్శించారు. కార్మికులు పోరాడి సాధించుకున్న హక్కులను హరిస్తూ పెట్టుబడిదారులకు దాసోహం అనేలా కార్మిక చట్టాలను రూపకల్పన చేయటానికి చూస్తున్నారని వాటిని కార్మిక సంఘాలన్నీ ముక్తకంఠంతో వ్యతిరేకించాలని తిరుపతయ్య పేర్కొన్నారు. కూటమి ప్రభుత్వం ఎన్నికల సందర్భంగా ఇచ్చిన హామీలను అమలు చేయాలని ఆయన అన్నారు. కేంద్ర ప్రభుత్వం అవలంబిస్తున్న నియంతృత్వ పోకడలను దేశ ప్రజలందరూ ముక్తకంఠంతో వ్యతిరేకిస్తున్నారని తిరుపతయ్య ఆరోపించారు. ఈ మహాసభలో సిపిఐ నియోజకవర్గ కార్యదర్శి లు యార్లగడ్డ వెంకటేశ్వరరావు, కంచర్ల కాశయ్య, సిపిఐ నాయకులు ఎస్కే కరీముల్లా, నూతక్కి శ్రీనివాసరావు, మంచికలపూడి శివయ్య, శాఖ సీపీఐ నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

'సూపర్ ఆరు' పథకాలను వెంటనే అమలు చేయాలి

విశాలాంధ్ర-నూజెండ్ల : మండలంలోని రవ్వారం గ్రామంలో రాష్ట్ర ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన హామీలు సూపర్ సిక్స్ పథకాలను వెంటనే అమలు చేయాలని సీపీఐ వినుకొండ ఏరియా నాయకులు ఉలవలపూడి రాము అన్నారు. నూజెండ్ల మండలంలోని రవ్వారం గ్రామ శాఖ సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడుతూ ఎన్నికలప్పుడు కూటమి ప్రభుత్వం రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు రాష్ట్ర ప్రజలకు ఇచ్చిన వాగ్దానాలు పెన్షన్లు, గ్యాస్ సిలిండర్లు తప్ప మిగిలినవి అమలు చేయలేదని, అవి కూడా అందరికీ అర్హులైన వారికి చెందలేదని, కావున మహిళలకు నెలకు రూ.1500లు, తల్లికి వందనం రూ.15 వేలు, మహిళలకు ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణం, రైతులకు రూ.20 వేలు తదితర హామీలను వెంటనే అమలు చేయాలని, నిరుపేదలకు గ్రామాలలో మూడు సెంట్లు, పట్టణాలలో రెండు సెంట్లు ఇంటి స్థలానికి పట్టాలు ఇచ్చి ఇంటి నిర్మాణానికి రూ.5 లక్షలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. మండల కార్యదర్శి ఎ.పవన్ కుమార్ మాట్లాడుతూ గత ప్రభుత్వ హయాంలో రాష్ట్రంలో చాలామందికి వృద్ధులు, వికలాంగులు, వితంతువులు, ఒంటరి మహిళలు అర్హులైన వారు పెన్షన్లు అందక ఇబ్బందులుపడ్డారన్నారు. కూటమి ప్రభుత్వం అర్హులైన వారికి పెన్షన్‌లు, రేషన్ కార్డులు వెంటనే మంజూరు చేయాలని సూచించారు. శాఖ మహాసభలు పూర్తిచేసుకుని నూజెండ్ల మండల మహాసభ జూన్ 13వ తేదిన నూజెండ్లలో ఉదయం 10 గంటలకు నిర్వహించడం జరుగుతుందని మండలంలోని పార్టీ సభ్యులందరూ మహాసభలో పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. కార్యక్రమంలో షేక్ ఖాసిం, షేక్ కాశమ్మ, పడిగపాటి చెంచమ్మ, పడిగిపాటి రాజశేఖర్ రెడ్డి, షేక్ నబీనా, రాయపూడి గురునాథం, లక్కిరెడ్డి శివనాగిరెడ్డి, కె.శ్రీనివాస్, షేక్ చిన్నహసన్, మాజేటి నవీన్, కె.శివకుమారి తదితరులు పాల్గొన్నారు. మహాసభలో శాఖ కార్యదర్శిగా లక్కిరెడ్డి శివనాగిరెడ్డి, సహాయ కార్యదర్శిగా పగిడిపాటి చెంచమ్మలను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

భూమి, భుక్తి, పేద ప్రజల విముక్తి కోసం సీపీఐ

- పేదల కోసం పోరాడేది కమ్యూనిస్టులే
- సీపీఐ పల్నాడు జిల్లా కార్యదర్శి మారుతివరప్రాద్

విశాలాంధ్ర - చిలకలూరిపేట : భూమి కోసం, భుక్తి కోసం, పేద ప్రజల విముక్తి కోసం పోరాడిన 100 సంవత్సరాల సుదీర్ఘ పోరాట చరిత్ర సీపీఐకే సొంతమని సీపీఐ పల్నాడు జిల్లా కార్యదర్శి ఎ.మారుతీవరప్రసాద్ చెప్పారు. బుధవారం రాత్రి చిలకలూరిపేట పట్టణంలోని రూత్‌డైక్‌మెన్ నగర శాఖ మహాసభలకు ఆయన ముఖ్యఅతిధిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పేదల కోసం పోరాడేది కమ్యూనిస్టులేనని, సీపీఐ తోనే సమస్యల పరిష్కారం సాధ్యమని పేర్కొన్నారు. కమ్యునిజానికి అంతం లేదని పుట్టగొడుల్ల పుట్టుకొచ్చే పార్టీలు అధికారం లేకపోతే కనుమరుగయ్యే పార్టీలు, రోజుకో జెండా మార్చే నాయకులు ఉన్న ఈ రోజుల్లో వందేళ్ళ చరిత్ర కలిగిన భారత కమ్యూనిస్టు పార్టీ ప్రతిఒక్కరికీ ఓ దిక్సూచి అని తెలిపారు. అధికారం ఉన్నా లేకపోయినా సుదీర్ఘ ప్రయాణంలో ఎన్నో పోరాటాలు ఒడిదుడుకులను ఎదుర్కొని కార్మికులకు ఎనిమిది గంటల పనిదినాలు, ఉపాధి హామీ చట్టం, దున్నే వాడిదే భూమి అంటూ ఎన్నో చట్టాల అమలులో కమ్యూనిస్టుల పాత్ర కీలకం అని పేర్కొన్నారు. కార్మిక హక్కుల సాధనకై కార్మికుల కోసం కర్షకుల కోసం పేదవాడి ఆకలి తీర్చడానికి పోరాటాలు నిర్వహించిన పార్టీ సీపీఐ అని అన్నారు.

సూపర్ సిక్స్ హామీలు అమలు చేయాలి...

దేశంలో బీజేపీ అధికారంలోకి వచ్చిన నాటి నుంచి కార్మికుల హక్కులను హరించేలా దాడి కొనసాగుతోందని విమర్శించారు. బీజేపీ మతోన్మాద ఎజెండాను అమలు చేస్తూ రాజ్యాంగ హక్కులను హరిస్తోందని ఆరోపించారు. సూపర్ సిక్స్ హామీలతో అధికారం చేపట్టిన కూటమి ప్రభుత్వం హామీలను నెరవేర్చటంలో విఫలమయ్యారని తెలిపారు. పేదలకు పట్టణ ప్రాంతాల్లో రెండు సెంట్లు, గ్రామీణ ప్రాంతాల్లో మూడు సెంట్లు ఇచ్చి గృహ నిర్మాణాలు చేపట్టనున్నట్లు హామీ ఇచ్చిన కూటమి ప్రభుత్వం కేవలం ప్రకటన మాత్రమే విడదల చేసి, ఇంత వరకు కార్యచరణ ప్రకటించలేదన్నారు. సీపీఐ నాయకులు, కార్యకర్తలు ప్రజల్లో మమేకమై వారి సమస్యల పరిష్కారానికి కృషి చేయాలన్నారు. రూత్ డైక్‌మెన్ కాలనీ శాఖ కార్యదర్శిగా కొమరగిరి చెంచయ్య, సహాయ కార్యదర్శిగా వేల్పుల అంజ య్య, మరో ఏడుగురిని కార్యవర్గ సభ్యులుగా ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కార్యక్రమంలో సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి షేక్ హుస్సేన్, ఏరియా ఇన్‌చార్జి కార్యదర్శి తాళ్లూరి బాబురావు, ఏఐవైఎఫ్ జిల్లా కార్యదర్శి షేక్ సుభాని, ఏపీ మహిళా సమాఖ్య ఏరియా కార్యదర్శి చెరుకుపల్లి నిర్మల, అక్కులయ్య తదితరులు పాల్గొన్నారు.

జీడీసీసీ బ్యాంక్ చైర్మన్‌గా మక్కెన ప్రమాణ స్వీకారం

- ముఖ్య అతిథిగా హాజరైన మంత్రి అచ్చెన్నాయుడు

విశాలాంధ్ర- గుంటూరు వైద్యం : గుంటూరు జిల్లా కేంద్ర సహకార బ్యాంక్ చైర్మన్‌గా మక్కెన మల్లికార్జున రావు ప్రమాణ స్వీకారం గురువారం జరిగింది. ఈ ప్రమాణ స్వీకార మహోత్సవానికి రాష్ట్ర సహకార, వ్యవసాయం, మార్కెటింగ్, పశు సంవర్ధక, పాడి పరిశ్రమ అభివృద్ధి, మత్స్యశాఖ మంత్రి అచ్చెన్నా యుడు, గుంటూరు ఎంపీ డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్, ఎమ్మెల్యేలు గళ్ళా మాధవి, భాష్యం ప్రవీణ్, నక్కా ఆనంద్‌బాబు, జీవీ ఆంజనేయులు, ఆంధ్ర ప్రదేశ్ ఇండస్ట్రియల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ (ఏపీ ఐడీసీ)చైర్మన్ డేగల ప్రభాకర్, టీటీడీ పాలక మండలి సభ్యులు జంగా కృష్ణమూర్తి, పిడుగురాళ్ళ జడ్పీటీసీ జంగా వెంకట కోటయ్య, గుంటూరు డిప్యూటీ మేయర్ షేక్.సజీల, విజ్ఞాన విద్యా సంస్థల అధినేత లావు రత్తయ్య, టీడీపీ రాష్ట్ర నాయకులు కన పర్తి శ్రీనివాసరావు, మ్యానీ, టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులు పాల్గొని మక్కెన మల్లికార్జునరావుకు శుభాకాంక్షలు తెలియజేశారు. అనంతరం మంత్రి అచ్చెన్నాయుడు మాట్లాడుతూ మాజీ ముఖ్యమంత్రి నందమూరి తారక రామారావు రైతుల కోసం స్థాపించిన బ్యాంక్ జీడీసీసీ బ్యాంక్ అని అన్నారు.

జంజనంకు నివాళులర్పించిన సీపీఐ నాయకులు

విశాలాంధ్ర - మంగళగిరి : మంగళగిరి పట్టణానికి చెందిన టీడీపీ నాయకులు, వ్యాపారవేత్త జంజనం మల్లేశ్వరరావు కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతూ బుధవారం మృతి చెందారు. ఆయన భౌతికకాయానికి గురువారం సీపీఐ నియోజకవర్గ కార్యదర్శి చిన్ని తిరుపతయ్య పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం వారి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. నివాళులర్పించిన వారిలో సీపీఐ పట్టణ కార్యదర్శి అన్నవరపు ప్రభాకర్, పట్టణ సహాయ కార్యదర్శి నందం బ్రహ్మేశ్వరరావు, ఏఐటీయూసీ నియోజకవర్గ కార్యదర్శి చిన్ని సత్య నారాయణ, ఉడత శ్రీనివాసరావు, శంకర్రావు తదితరులు ఉన్నారు.

పదోన్నతి పొందిన ఖాసిం, ఖాజావలి, నాగేశ్వరరావుకు సన్మానం

విశాలాంధ్ర - గుంటూరు కలెక్టరేట్ : గుంటూరు జిల్లా ఉర్దూ స్కూల్ డీఐగా పనిచేస్తూ యర్రగొండపాలెం ప్రభుత్వ ఉన్నత పాఠశాల ప్రధానో పాధ్యాయులుగా పదోన్నతి పొందిన షేక్ ఎండీఖాసీంకు, మున్సిపల్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులుగా పదోన్నతి పొందిన ఎస్టీయూ సీనియర్ నాయకులు షేక్ ఖాజావలి, గేరా నాగేశ్వరరావులకు గుంటూరు ఎస్టీయూ భవన్‌లో ఎస్టీయూ జిల్లా శాఖ ఆధ్వర్యంలో ఏఐఎస్టీఎఫ్ జాతీయ ఆర్థిక కార్య దర్శి సీహెచ్ జోసెఫ్ సుధీర్ బాబుచే అభినందన కార్యక్రమం గురువారం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా సుధీర్ బాబు మాట్లాడుతూ ఉర్దూ డీఐగా గుంటూరు జిల్లాలో పనిచేస్తున్నప్పుడు ఏ సమస్యనైనా వారి దృష్టికి తీసుకు వెళ్లినప్పుడు తక్షణమే స్పందించి పరిష్కరించే వారని ఉపాధ్యాయులతో స్నేహ పూర్వకంగా మెలుగుతూ వారికి నిర్మాణాత్మక సూచనలు, ఇచ్చి విద్యాభివృద్ధికి ఎంతో పాటుపడ్డారని ఖాసిం సేవలను కొనియాడారు. ఎస్టీయూ జిల్లా అధ్యక్షులు డి.పెదబాబు, ప్రధాన కార్యదర్శి డీకే సుబ్బారెడ్డి మాట్లాడుతూ సంఘం పురోభివృద్ధికి, ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి షేక్ ఖాజావళి, జి.నాగేశ్వరరావులు చేసిన సేవలు ప్రశంసనీయమని అన్నారు.

విలేకరులు కావలెను

విశాలాంధ్ర దినపత్రికకు కృష్ణాజిల్లాలో
దిగువ పేర్కొన్న మండలాల్లో పనిచేయుటకు
విలేకరులు కావలెను

ఇంటర్మీడియట్ చదివి తెలుగు భాషా పరిజ్ఞానం కలిగి సామాజిక, రాజకీయ అంశాలపై అవగాహన ఉన్న అభ్యర్థులు అర్హులు

పనిచేయవలసిన మండలాలు :
బాపులపాడు, కోడూరు, గూడూరు, నాగాయలంక, నందివాడ, తోట్లవల్లూరు, ఉంగుటూరు

సంప్రదించవలసిన ఫోన్ నెంబర్స్ : 8074662146, 9490338489

గమనిక : ఆయా ప్రదేశాలల్లో స్థానికులై ఉండాలి

విశాలాంధ్ర జిల్లా కార్యాలయం
ఈడేపల్లి, ఆంజనేయస్వామి గుడి ఎదుట, మచిలీపట్నం

స్కేటింగ్‌లో 5 పతకాలు సాధించిన కైవల్యను అభినందించిన ఎంపి కేశినేని శివనాథ్ (చిన్ని)

విశాలాంధ్ర-విజయవాడ స్పోర్ట్స్ : తైవాన్ లో ఇటీవల మార్చి నెలలో 25వ తేదీ నుంచి 30 వరకు జరిగిన అంతర్జాతీయ ఆర్టిస్టిక్ స్కేటింగ్ ఛాంపియన్ షిప్-2025లో నాలుగు బంగారు, ఒక వెండి పతకం సాధించిన కొప్పరపు కైవల్య ను విజయవాడ ఎంపి కేశినేని శివనాథ్ అభినందించారు. గురునానక్ కాలనీలోని ఎన్టీఆర్ భవన్ లో గురువారం ఎంపి కేశినేని శివనాథ్ ను కొప్పరపు కైవల్య మర్యాదపూర్వకంగా కలిశారు. యూత్ కేటగరిలో పోటీపడిన తను ఫ్రీ స్టైల్ , ఇన్ లైన్, సోలో డ్యాన్స్, పెయిర్ స్కేటింగ్ లో బంగారు పతకాలు సాధించగా, కపుల్ డ్యాన్స్ లో వెండి పతకం సొంతం చేసుకున్నట్లు ఎంపి కేశినేని శివనాథ్ కి కైవల్య వివరించారు. తను సాధించిన పతకాలు ఎంపి కేశినేని శివనాథ్ కి చూపించారు. ప్రపంచ క్రీడా వేదిక పై సత్తా చాటి రాష్ట్ర ఖ్యాతి ఇనుపడింప చేసిన కైవల్యను ఆదర్శంగా తీసుకుని క్రీడాల్లో రాణించాలని యువతకు ఎంపీ కేశినేని శివనాథ్ సూచించారు. అలాగే జూలై నెలలో సౌత్ కొరియాలో జరగబోయే ఏషియన్ ఛాంపియన్ షిప్ లో పాల్గొనబోతున్న కైవల్య తన మెరుగైన ప్రతిభతో సత్తా చాటాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో కైవల్య తండ్రి శశికుమార్ పాల్గొన్నారు. అభినందించిన ఎంపి కేశినేని శివనాథ్ కి కైవల్య కృతజ్ఞతలు తెలిపారు.

గెలాక్సీ ఎస్ 25 అల్ట్రాపై అద్భుతమైన ధరను ప్రకటించిన సామ్‌సంగ్

విశాలాంధ్ర-విజయవాడ (వన్‌టౌన్): భారతదేశంలో అతిపెద్ద వినియోగదారు ఎలక్ట్రానిక్స్ బ్రాండ్ సామ్‌సంగ్, తమ ప్రతిష్టాత్మక గెలాక్సీ ఎస్25 అల్ట్రాపై అద్భుతమైన పరిమితకాల ఆఫర్‌ను ప్రకటించింది. మొదట్లో రూ. 129999 ప్రారంభ ధరతో లభించిన గెలాక్సీ ఎస్ 25 అల్ట్రా ఇప్పుడు కేవలం రూ. 117999 వద్ద అందుబాటులో ఉంటుంది. గెలాక్సీ ఎస్ 25 అల్ట్రాపై ప్రత్యేక ధర వద్ద రూ. 12000 తక్షణ క్యాష్‌బ్యాక్ కూడా కలిసి ఉంటుంది. వినియోగదారులకు ఈ ఆఫర్, మరింత ఆకర్షణీయంగా మలుస్తూ, గెలాక్సీ ఎస్ 25 అల్ట్రా 24 నెలల నో-కాస్ట్ ఈఎంఐతో కూడా అందుబాటులో ఉంది. మెరుగైన లభ్యత కోరుకునే వినియోగదారులు నెలకు రూ. 3278 నుండి ప్రారంభమయ్యే నోకాస్ట్ ఈఎంఐని సద్వినియోగం చేసుకోవచ్చు.

శ్రీ చైతన్య విజయోత్సవ ర్యాలీ

విశాలాంధ్ర-విశాలాంధ్ర: జేఈఈ అడ్వాన్స్డ్ ఫలితాల్లో శ్రీ చైతన్య విద్యార్థులు 1, 3, 5, 6 ర్యాంకులలో విజయకేతనం ఎగురవేశారు. విజయవాడ విభాగం నుంచి ఆలిండియా కేటగిరీ 100వ ర్యాంకు లోపు ముగ్గురు, 1000వ ర్యాంకు లోపు 44మంది విద్యార్థులు ర్యాంకులు సాధించారు. ఈ సందర్భంగా విద్యా సంస్థలు ఛైర్మన్ ఝాన్సీ లక్ష్మీ జెండా ఊపి విజయోత్సవ ర్యాలీ ప్రారంభించారు. కానూరు శ్రీ చైతన్య ఐపీఎల్ బ్రాంచ్ నుంచి ర్యాలీ ప్రారంభమై నిడమానూరు, గూడవల్లి, కెసరపల్లి, రామవరప్పాడు, బెంజి సర్కిల్ బ్రాంచ్ లో వరకు ఈ ర్యాలీ కొనసాగింది. ఈ విజయోత్సవ ర్యాలీ జయప్రద చేసినందుకు విద్యా సంస్థల ఎంజీఎం మురళీకృష్ణ విద్యార్థులకు, వేలాది మంది అధ్యాపకులకు, సిబ్బందికి అభినందనలు తెలియజేశారు.

ఈఈఎస్ఎల్ ఆధ్వర్యంలో ఇండక్షన్ కుక్‌టాప్‌లు & వంట పాత్రల సెట్ల పంపిణీ

విశాలాంధ్ర-విజయవాడ:- ప్రపంచ పర్యావరణ దినోత్సవం పురస్కరించుకుని భారత ప్రభుత్వ విద్యుత్ మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలోని ఉమ్మడి భాగస్వామ్య సంస్థ అయిన ఎనర్జీ ఎఫిషియెన్సీ సర్వీసెస్ లిమిటెడ్ (ఈఈఎస్ఎల్) భాగస్వామ్యంతో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం, నేషనల్ ఎఫీషియెంట్ కుకింగ్ ప్రోగ్రామ్ (ఎన్ ఈ సి పి) మొదటి దశలో భాగంగా రాష్ట్రవ్యాప్తంగా ఉన్న అంగన్‌వాడీ కేంద్రాలకు 11,400 ఇండక్షన్ కుక్‌టాప్‌లు మరియు స్టెయిన్‌లెస్-స్టీల్ పాత్రల సెట్‌లను పంపిణీ చేయడం ప్రారంభించింది. రాష్ట్రంలోని 55,607 అంగన్‌వాడీ కేంద్రాలను లక్ష్యంగా చేసుకుని ఈ పంపిణీ కార్యక్రమం ప్రారంభమైనది. ఈ పంపిణీ కార్యక్రమం రాష్ట్రంలోని 26 జిల్లాలను కవర్ చేస్తూ ప్రారంభించబడుతుంది. ఈ కార్యక్రమాన్ని ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ స్త్రీ మరియు శిశు సంక్షేమ శాఖ భాగస్వామ్యంతో అమలు చేస్తున్నారు. ఈ కార్యక్రమానికి ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ స్త్రీ మరియు శిశు సంక్షేమ శాఖ మంత్రి గుమ్మిడి సంధ్యా రాణి, విజయవాడ నియోజక వర్గ పార్లమెంటు సభ్యులు (ఎంపి) కేశినేని చిన్ని, విజయవాడ తూర్పు శాసనసభ సభ్యులు గద్దె రామ మోహన్ రావు, మహిళాభివృద్ధి, శిశు సంక్షేమ శాఖ కార్యదర్శి ఎ. సూర్య కుమారి, ఈఈఎస్ఎల్ చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ (సీఈఓ), విశాల్ కపూర్, ఈఈఎస్ఎల్ & ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం నుండి ఇతర సీనియర్ ప్రముఖులు హాజరయ్యారు. ఈ వేడుకలో, భాగంగా పాత్రల సెట్లతో కూడిన 05 ఇండక్షన్ కుక్‌టాప్‌లను అంగన్‌వాడీ కేంద్రాలకు లాంఛనంగా పంపిణీ చేశారు. విద్యుత్ మంత్రిత్వ శాఖ 'గో ఎలక్ట్రిక్' ప్రచారం కింద నవంబర్ 2, 2023న జాతీయ స్థాయిలో ప్రారంభించబడిన నేషనల్ ఎఫిషియంట్ కుకింగ్ ప్రోగ్రామ్ (ఎన్‌ఈసిపి), బ్యూరో ఆఫ్ ఎనర్జీ ఎఫిషియెన్సీ (బిఈఈ) మార్గదర్శకత్వంతో భారతదేశం అంతటా విద్యుత్ ఆదా చేసే విద్యుత్ వంట ఉపకరణాలను విస్తృతంగా స్వీకరించడాన్ని ప్రోత్సహించడం లక్ష్యంగా పెట్టుకుంది.

రైతులకు నేస్తం కూటమి ప్రభుత్వం : ఎమ్మెల్యే కాగిత కృష్ణ ప్రసాద్

విశాలాంధ్ర-బంటుమిల్లి:- రైతుల సంక్షేమమే రాష్ట్ర పురోగతికి జీవనాధారమని ,వారి సంక్షేమంకోసం కూటమి ప్రభుత్వం రైతు నేస్తం గా నిలుస్తుందని పెడన నియోజకవర్గ శాసనసభ్యులు కాగిత కృష్ణప్రసాద్ అన్నారు.రానున్న సార్వ పంటకు వరి విత్తనాలను సబ్సిడి తో మండల పరిదిలోని ముంజులూరు గ్రామ రైతులకు గురువారం గ్రామ రైతు భరోసా కేంద్రం వద్ద వ్యవసాయశాఖ అధికారుల పర్యవేక్షణలో శాసనసభ్యులు కాగిత కృష్ణప్రసాద్ చేతుల మీదుగ అందజేశారు .ఈ సందర్భంగా కాగిత రైతులనుద్దేశించి మాట్లడుతూ ప్రస్తుతం ఖరీఫ్ సీజన్ కావడంతో వ్యవసాయాధికారులు ఎల్లవేళలా రైతులకు అందుబాటులో ఉండాలని అన్నారు.గత దుర్మార్గపు పరిపాలనలో పంట కాలువలు,మురుగు కాల్వలు పుడుకుపోయి,వాటిని బాగుచేయించేనాధుడులేక చేతికి అందివచ్చిన పంటలను నష్టపోయి రైతులు అనేక కష్టాలను అనుభవించారని అన్నారు .కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టిన వెంటనే ధన్యం ఏ రంగులో ఉన్నప్పటికీ దాన్యానికి గిట్టుబాటు ధర కల్పించి ప్రభుత్వం నుండి నేరుగా రైతుల బ్యాంకు ఖాతాల్లో వెంటనే జమచేసిన ఘనత కూటమి ప్రభుత్వానిదేనన్నారు .రైతులకు సబ్సిడీపై వరి విత్తనాలు ,ఎరువులు ,పురుగుమందులను అందజేస్తుందన్నారు .రైతులు పండించిన పంటకు గిట్టుబాటుధర కల్పించేబాధ్యత కూటమి ప్రభుత్వానిదన్నారు.ఖరీఫ్ సీజన్ లో రైతులకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా చూడాలని రాయితీపై వరి విత్తనాలు అందించాలని అధికారులను ఆదేశించారు.అనంతరం పర్యావరణ పరిరక్షణకోసం మొక్కలు నాటి గ్రామంలోని ప్రతి ఒక్కరూ ఒక మొక్క నాటి జాగ్రత్తగా చూసుకోవాలని ఎమ్మెల్యే కాగిత కృష్ణ ప్రసాద్ తెలియజేశారు.ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయశాఖధికారి జి శివరామకృష్ణ ,మండల నీటిసంఘం అధ్యక్షులు బొర్ర కాశీ విశ్వేశ్వర రావు ,టిడిపి మండలపార్టీ అధ్యక్షులు కూనపురెడ్డి వీరబాబు,భూపతి రమేష్, కూటమి నాయకులు ,కార్యకర్తలు ,రైతులు పాల్గొన్నారు.

గ్రీన్ ఎనర్జీలో పెట్టుబడులు పెరగాలి పర్యావరణ సదస్సులో : డాక్టర్ జి అనిత

విశాలాంధ్ర-విజయవాడ (గాంధీనగర్): ప్రపంచ పర్యావరణ సంస్థ ఆధ్వర్యం లో విజయవాడ ప్రెస్ క్లబ్ లో పర్యావరణ దినోత్సవం సందర్భంగా రౌండ్ టేబుల్ సమావేశం గురువారం జరిగింది. ఆ సంస్థ ఫౌండర్ సీచ్ భద్ర పిలుపు మేరకు సుమారు ఏడు రాష్ట్రాల్లో ఈ కార్యక్రమాలు జరిగాయి. ఈ సమావేశానికి ఆ సంస్థ ఎపి రాష్ట్ర అధ్యక్షుడు బి ఎస్ భార్గవ్ కుమార్ అధ్యక్షత వహించారు. ఈ సమావేశానికి ముఖ్య అతిధిగా విచ్చేసిన డాక్టర్ జి.అనిత మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం 2047 కల్లా స్వర్ణాంధ్రప్రదేశ్ గా రూపాంతరం చెందాలని దానికి అందరం కట్టుబడి పని చేయాలని ఆమె పిలుపునిచ్చారు. గ్రీన్ ఎనర్జీ లో పెట్టుబడులు పెట్టాలని ఆమె కోరారు అంతేకాకుండా ఎప్పుడైతే పర్యావరణం ఆధారంగా వృత్తులు పెరుగుతాయో దాని ద్వారా ప్రజలు ఆధారపడి బతుకుతారో అప్పుడు ప్రజలు పర్యావరణాన్ని కాపాడుకుంటారని ఆమె తెలిపారు. పర్యావరణ హితమైన వ్యవసాయ ఉత్పత్తులు వ్యాపారంగా మారి ఉపాధి గా మారితే రాష్ట్ర ఆదాయం అభివృద్ధి చెంది చాలామంది జీవితాలు మార్పు చెందుతాయని ఆమె పేర్కొన్నారు. ఈ సందర్భంగా రాష్ట్ర అధ్యక్షుడు బి ఎస్ భార్గవ్ కుమార్ మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం మరియు రాజధాని అమరావతి ఆంధ్రుల గుండె చప్పుడని ఈ రాష్ట్రాన్ని క్లీన్ అండ్ గ్రీన్ గా ఉంచేందుకు ప్రపంచ పర్యావరణ సంస్థ కృషి చేస్తుందని తెలిపారు. అంతేకాకుండా అటవీ ఉత్పత్తులు వాటి మీద ఆధారపడి బతుకున్నవాళ్ళు రాజధాని లిమిట్స్ లో చాలామంది ఉన్నారని వీరికి తగిన గుర్తింపు రావటంలేదని ఆవేదన వ్యక్తం చేసారు ఉదాహరణకు కొండపల్లి బొమ్మలు అంతర్జాతీయంగా గుర్తింపు ఉన్నా దానికి ఉపయోగించే పొనికి చెక్క మాత్రం కనుమరుగవుతుందని దీనిని మనం కాపాడుకోవాలని తెలిపారు. అదేవిధంగా నందిగామ లాంటి ప్రాంతాల్లో భూగర్భజలాలు అడుగంటాయని కొన్ని ప్రాంతాల్లో ఫ్లోరైడ్ సమస్య ఉందని దీని నివారణకు కృషి చేయాలని తెలిపారు. సీనియర్ జర్నలిస్ట్ వెంకట్ కొల్లూరి మాట్లాడుతూ మానవ వ్యర్థాలను రీసైక్లింగ్ చేయటం లో తీవ్ర స్థాయిలో వైఫల్యం ఉందని దీని వెంటనే నివారించాలన్నారు అంతేకాకుండా ప్లాస్టిక్ వినియోగం-తగ్గించాలని అందరు మొక్కలు నాటాలని తెలిపారు. మోటివేషనల్ స్పీకర్ డాక్టర్ కాళహస్తి నల్లిబోయిన మాట్లాడుతూ పర్యావరణాన్ని కాపాడటం లో యువత ప్రధాన పాత్ర పోషించాలని కాలుష్యాన్ని తగ్గించే రవాణా సాధనాలు వినియోగించాలని సోలార్ ఎలక్ట్రిక్ వైపు యువత అడుగులు వేయాలన్నారు.ఈ కార్యక్రమంలో ప్రపంచ పర్యావరణ సంస్థ సభ్యులు రాష్ట్ర ఎన్జీఓ నాయకులు నాళం మురళీ కృష్ణ, నాయకులు ఉమామహేశ్వరి, కవితాలక్ష్మి, అనూషా, వెంకయ్య, దుర్గలక్ష్మి, దుర్గ శివ నాగ ప్రసాద్, రమ్య, బాలాజీ, ఫణేంద్ర, రాజేష్ తదితురులు పాల్గొన్నారు.